

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 10.11.2025 | సంపుటి : 2 | సంచిక :276 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Monday 10.11.2025 volume : 2 Issue : 276 Pages : 8 Cost : 2/-

# రాసిపెట్టుకోండి..
## 2034 వరకూ మాదే అధికారం

- ప్రజలు మాకు కూడా పదేళ్లు పాలించే అవకాశం ఇస్తారు
- గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా?
- కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతివ్వలేదు
- భాజపాకు డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే
- కాలేజీల్లో అన్నీ సవ్యంగా ఉన్నట్లు తేలితే అదే రోజు 100% ఫీజు రీయింబర్స్‌మెంట్
- 'మీట్ ద ప్రెస్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



"'అసెంబ్లీ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఐదేళ్లకు ఎన్నికలు జరుగుతాయి. 2034 జూన్ వరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలో ఉంటుంది. పదేళ్లు టీడీపీ, పదేళ్లు కాంగ్రెస్, పదేళ్లు కేసీఆర్‌కు ప్రజలు అవకాశమిచ్చారు. మాకు కూడా పదేళ్లు అధికారమిస్తారు. ఈ పదేళ్లలో 100 ఏళ్లకు అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను రచించి ముందుకు తీసుకెళ్తాం. 2004-14 వరకు జరిగి ఆ తర్వాత ఆగిపోయిన అభివృద్ధిని 2024-34 మధ్య కొనసాగిస్తాం. ఇప్పటికి రెండేళ్లయింది.

"రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

**హైదరాబాద్, నవంబర్ 9 :** "జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం నగర అభివృద్ధికి కీలకంగా మారింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయి. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం ఇక్కడికే వచ్చాయి. ప్రపంచాన్నే శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలే కారణం. అభివృద్ధి మాత్రమే కాదు.. సంక్షేమంలోనూ వారు తమదైన ముద్ర వేశారు. 2004-2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉంటూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశాయి.



## ఉత్తరాఖండ్ మార్గంలో
# నడవాలి

- ఇతర రాష్ట్రాలకు మోదీ సూచన
- యూసీసీని అమలు చేస్తోందని, మత మార్పిడులు అడ్డుకుంటోందని ప్రశంసలు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న మోదీ

ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రంలో జనాభా స్థితిగతుల్లో మార్పులు రాకుండా ధైర్యంగా చర్యలు చేపట్టిందని, ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తోందని, చట్టవిరుద్ధమైన మత మార్పిడులను సమర్థంగా అడ్డుకుంటోందని చెప్పారు. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలని సూచించారు. యూసీసీ అమలుపై ఉత్తరాఖండ్ చర్యలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మత మార్పిడుల నియంత్రణ చట్టం, అల్లర్ల నియంత్రణ చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేస్తోందని తెలిపారు.



## ఆరు గ్యారెంటీల పేరుతో
# కాంగ్రెస్ సర్కార్ దగా

- రేవంత్ మూడేళ్లు ఉంటారో లేదో జూబ్లీహిల్స్‌లో తీర్పుతో తేలిపోతుంది
- రాష్ట్ర ప్రజలకు న్యాయం చేసే అవకాశం ఇక్కడి ఓటర్లకు దక్కింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఓట్ల కోసం ప్రజలను మోసం చేయాలని చూస్తోన్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పతనం ప్రారంభం అవుతుందంటూ వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ బాటలోనే రేవంత్

## ఇళ్లు ఆశ చూపి ఓట్లు వేయించుకోవడం అలవాటైంది

### జూబ్లీహిల్స్‌లో మజ్లిస్ నేతల దాదాగిరీ నడుస్తోంది: కిషన్‌రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పాదయాత్ర చేసి వివిధ కాలనీల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెబితే, రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు అంటున్నారు. ఇద్దరూ మోసం చేస్తున్నారు. ఇండ్లు ఆశ చూపి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మరచిపోవడం అలవాటైంది.



**హైదరాబాద్, నవంబర్ 9 :** ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ఎందుకు జరగలేదు? ఈ వెనకబాటుకు కారణం ఎవరు? గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనికి బాధ్యులు కావా? ఆ పార్టీల నిర్లక్ష్యం వల్లే ప్రజలకు ఈ దుస్థితి పట్టింది'అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. 'మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులు దాదాగిరి చేస్తున్నారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. భవిష్యత్తులో వీరి ఆగడాలు మరింత పెరిగే అవకాశం ఉంది. మన బిడ్డలను మనం రక్షించుకోవాలన్నా, మనకు రక్షణ కావాలన్నా, నియోజకవర్గం బాగుపడాలన్నా బీజేపీని గెలిపించాలి'అని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు,

మిగతా 2 లో



## పాతబస్తీలో డ్రగ్స్ రాకెట్
# ఆగడాలు

- మజ్లిస్ పార్టీ అండదండలతో హిందూ అమ్మాయిలపై దురాగతాలు
- వారిని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- మీడియా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్:** పాతబస్తీలో మజ్లిస్ పార్టీ అండతో డ్రగ్స్ రాకెట్ హిందూ బాలికలను లక్ష్యంగా చేసుకొని కిడ్నాప్, అత్యాచారాలు చేస్తూ వాళ్ల జీవితాలను నాశనం చేస్తున్నాయని

మిగతా 2 లో

# ముగిసిన ప్రచారం

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక హోరాహోరీ ప్రచారానికి తెర
### రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం
### ప్రలోభాలకు తెరలేపిన రాజకీయ పార్టీలు..
### ఓటుకు నోటుతోపాటు విందులు, వినోదాలు



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం ఆదివారంతో ముగిసింది. నెల రోజులుగా నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా వ్యూహప్రతివ్యూహాలతో ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. పార్టీ అభ్యర్థుల తరపున హేమాహేమీలు రంగంలోకి దిగారు. మంగళవారం పోలింగ్ జరగనుంది. ప్రచారం ముగియడంతో మైకులు మూగబోయాయి. తెరవెనుక మంత్రాంగం ప్రారంభమైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమం షురూ అయింది. ఆయా డివిజన్ ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో రూ.2,500చొప్పున కొందరు, రూ.వెయ్యి చొప్పున మరికొందరు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. 02

## బీఆర్ఎస్‌తో ఎలాంటి
# సంబంధం లేదు

- పార్టీ నుంచి అవమానకరంగా పంపారు
- ఆడపిల్ల రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తా
- ప్రొటోకాల్ పేరుతో నాడు నిజామాబాద్ దాటనివ్వలేదు



**వరంగల్, నవంబర్ 9 :** 'బీఆర్ఎస్ నుంచి నన్ను అవమానకరంగా బయటకు పంపారు.. తప్పు చేసి ఉంటే నోటీసైనా ఇవ్వాల్సింది. ఇప్పుడు రాజకీయంగా బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు ప్రొటోకాల్ పేరుతో నన్ను నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికే కట్టడి చేశారు.

మిగతా 2 లో

## గోపీనాథ్ మరణం
# మిస్టరీగా అనిపిస్తోంది

### నా కొడుకు జూన్ 6న చనిపోయారా.. 8న చనిపోయారా ?
### మాగంటి తల్లి మహానందకుమారి సంచలన వ్యాఖ్యలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి ఒక మిస్టరీగా అనిపిస్తోందని.. కన్నతల్లినైన తనను, తోడబుట్టిన సోదరుడు వజ్రనాథ్‌ను ఆస్పత్రిలోనికి రానివ్వరాదని సునీత ఆర్డర్ పాస్ చేసిందని గోపీనాథ్ తల్లి మహానందకుమారి ఆరోపించారు. అసలు గోపీన్యాథ్ జూన్ 6వ తేదీన చనిపోయారా...జూన్ 8న చనిపోయారా అన్నదీ సందేహంగానే ఉందన్నారు. కేటీఆర్ వస్తున్నారు అని ఎవ్వరినీ చూడకుండా ఆపేసి, కేటీఆర్ వచ్చాక మరణవార్తను చెప్పారని ఆమె పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి గోపీనాథ్ మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్ ప్రద్యుమ్నతో కలిసి మహానందకుమారి విలేకరులతో మాట్లాడారు.



మిగతా 2 లో



## తెలుగు రాష్ట్రాల్లో
# పెరిగిన చలి తీవ్రత.?

- పడిపోయిన గరిష్ట,కనిష్ట ఉష్ణోగ్రతలు
- పది రోజులపాటు చలి తీవ్రత ఎక్కువ 02

వానాకాలం ఇట్ల పూర్తయిందో లేదో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. రెండు రోజులు తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. నిన్న మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎడతెరిపిలేని వర్షాలతో రెండు రాష్ట్రాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలి

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ రాష్ట్రం అవతరించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. రూ.8,260.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల భూములు కబ్జా కాకుండా, జనాభాలో అవాంఛనీయ మార్పులు రాకుండా ఇక్కడి బీజేపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. అభివృద్ధి ప్రయాణంలో అడ్డంకులను తొలగించుకుంటూ ఉత్తరాఖండ్ శరవేగంగా ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రం ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారనుందని అన్నారు.

### రాష్ట్ర ప్రజలే నాకు స్ఫూర్తి

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్‌తో తనకు గొప్ప అనుబంధం ఉందన్నారు. కొండలపై ప్రతికూల వాతావరణంలో జీవిస్తూ కష్టపడి పనిచేసే ఇక్కడి ప్రజలు తనకు నిత్యం స్ఫూర్తినిస్తుంటారని చెప్పారు. ఈ దశాబ్దం ఉత్తరాఖండ్‌దేనని తేల్చిచెప్పారు. రాష్ట్రం బలం ఆధ్యాత్మిక శక్తిలోనే ఉందన్నారు. గత 25 ఏళ్లలో అనూహ్యమైన ప్రగతి సాధించిందని కొనియాడారు. విద్య, పర్యాటకం, ఆరోగ్యం, ఇంధనం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. 25 ఏళ్ల క్రితం రాష్ట్రం బడ్జెట్ రూ.4,000 కోట్లు మాత్రమేనని, ఇప్పుడు రూ.లక్ష కోట్లకు చేరిందని స్పష్టంచేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకోసం ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేయాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన కేంద్రాలు, యోగా కేంద్రాలను గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తామని చెప్పారు.



# ముగిసిన ప్రచారం



**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర రాజకీయ ఉత్కంఠను రేకెత్తిస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కీలక ఘట్టం ముగిసింది. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ప్రచార గడువు ముగియడంతో అన్ని రాజకీయ పార్టీల మైకులు బందయ్యాయి. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచి బహిరంగంగా, అంతకుముందు అంతర్గతంగా ప్రచార పర్వంలో నిమగ్నమై కాళ్లకు బలపాలు కట్టుకొని నియోజకవర్గమంతా చుట్టివచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రచారం ముగియడంతో సేద దీరారు. అయితే, ప్రచారం ముగిసిన నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రలోభాలకు తెరలేచాయనే చర్చ జరుగుతోంది. ఈ ఉపఎన్నికలో గెలుపే ధ్యేయంగా పనిచేస్తోన్న మూడు ప్రధాన రాజకీయ పక్షాలతోపాటు ఇతర అభ్యర్థులు కూడా ఓటర్లను ప్రలోభపర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగానే నేరుగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడంతోపాటు పలు రకాల తాయిలాలు ఇస్తున్నారని, గల్లీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, కులాలు, వర్గాల వారీగా విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తున్నారని తెలుస్తోంది.

### పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఈసీ

మంగళవారం జరగనున్న పోలింగ్‌కు ఈసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. నియోజకవర్గంలో 407 పోలింగ్ బూత్‌లలో దాదాపు రెండువేలకు పైగా సిబ్బందిని పోలింగ్ నిర్వహణకు నియమించారు. 2,494 బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించి ఈ పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ఈసీ పూర్తి చేసింది. పోలీసు బందోబస్తు కోసం వేల సంఖ్యలో సిబ్బందిని నియమించారు. సోమవారం రాత్రికి పోలింగ్‌స్టేషన్ల వారీగా అటు ఎన్నికల నిర్వహణ, ఇటు బందోబస్తు సిబ్బందిని పంపడం ద్వారా పోలింగ్ సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికార వర్గాలంటున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

### అందరూ అక్కడే..

ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా ఈ ఫలితం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అన్నీతానై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 14 మంది మంత్రులు, 40 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలను రంగంలోకి దింపారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం జూబ్లీహిల్స్‌లోనే ఉందా అన్నట్లు గత 15 రోజులుగా మంత్రులు ప్రచారం హోరెత్తించారు. పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనపై సీఎం తూర్పారబట్టగా.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికి మంత్రులు అధిక ప్రాధాన్యమిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోతే.. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి నిలిచిపోతుందని సున్నితంగా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ తరఫున పలువురు అభ్యర్థిత్వం కోసం పోటీపడినా.. సీఎం చొరవతో నవీన్‌యాదవ్‌కు ఆ అవకాశం లభించింది. టికెట్ ఆశించిన వారిని బుజ్జగించారు. నాలుగు రోజులపాటు నియోజకవర్గంలో సీఎం రోడ్‌షోలలో పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితితో భాజపా కుమ్మక్కైందని కాంగ్రెస్ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు గుప్పించారు. మైనార్టీల మద్దతు కోసం ఎంఐఎంతో పొత్తు, అజారుద్దీన్‌కు మంత్రి పదవి లాంటి వ్యూహాలను పన్నారు. మంత్రులు పొన్నం, వివేక్, తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు ముందు నుంచి నియోజకవర్గంలో పర్యటించారు. పొంగులేటి, జూపల్లి, వాకిటి శ్రీహరి, దామోదర్ రాజనర్సింహ, సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు విస్తృతంగా పర్యటించారు.

# బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు

(మొదటిపేజీ తరువాయి)

నాడు ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం లేకుండా అనేక కుట్రలు చేశారు. అయినా అనేక సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించా. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ వ్యయం పెంచారు. మొదట రూ.1,100 కోట్లతో ఒక కంపెనీకి వచ్చిన పనులను బినామీ కంపెనీకి ఇచ్చారు. ఆ కంపెనీ అంచనాలు రూ.1,700 కోట్లకు చేర్చింది. అది హరీశ్‌రావుదే. పాలక పక్షం, ప్రతిపక్షం పనిచేయడం లేదు. అందుకే మేము ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నాం. ఇప్పుడే రాజకీయం చేయను, ఇంకా సమయం ఉంది, ఆడపిల్ల రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తా. వరంగల్‌లో ముంపు బాధితులను పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క పైసా ఇవ్వలేదు. ప్రభుత్వం మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలి' అని డిమాండ్ చేశారు.

# రాసి పెట్టుకోండి..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి 4 కోట్ల మంది ప్రజలకు ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? కాళేశ్వరం లేకుండానే మా ప్రభుత్వం అత్యధికంగా వరి పంటను ఉత్పత్తి చేసింది. గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులన్నీ పెండింగులోనే పెట్టారు. ఎలాంటి ప్రయోజనం లేని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం మాత్రమే కేసీఆర్ పూర్తిచేశారు.



### కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతివ్వలేదు

కేటీఆర్ జీవితంలోనే అధికారం అనే రేఖ లేదు. కుమారుడి విషయంలో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కేటీఆర్ దశే బాగాలేకపోతే కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ఏం లాభం? కేటీఆర్ ఎన్నికల ప్రచారం పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్‌సాంగ్‌ను గుర్తుకు తెస్తోంది. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్ని కూడా నేను రద్దు చేయలేదు. వాటిని కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్తపథకాలు తీసుకొచ్చాను. ఎస్సీ వర్గీకరణపై ఎవరూ చేయని సాహసం చేశాను. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపాను. దేశంలో ఎవరూ చేయని కులగణనను రాష్ట్రంలో చేసి చూపించాను. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించాను. మహిళలకు ఉచిత ప్రయాణం సహా అనేక ఎన్నికల హామీలు నెరవేర్చాను.

### భాజపాకు డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే

రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు గుజరాత్ తరలి వెళ్లేందుకు భాజపా నేతలు కృషి చేస్తున్నారు. సెమీ కండక్టర్ల కంపెనీ ఆ రాష్ట్రానికి తరలించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాది ఫెవికాల్ బంధం. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాం. ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ తెచ్చుకుంటే భాజపా దేశం మొత్తం గెలిచినట్లే. మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. నేను చెప్పేది రాసి పెట్టుకోండి.. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది"అని రేవంత్ అన్నారు.

### కాలేజీల బంద్‌తో 'ఫీజు'సమస్య పరిష్కారం కాదు...

నేను ఇవ్వాల్సింది ప్రతి విద్యార్థికి రూ. 35 వేలే. కానీ కాలేజీలు రూ. లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. యాజమాన్యాల కోరికలు తీర్చలేదనే పగతో కళాశాలలు బంద్ చేస్తామంటున్నారు. బంద్ చేస్తే పిల్లలు నష్టపోయే విద్యాసంవత్సరాన్ని ఎవరు తెచ్చిస్తారు? బంద్ బందూకుల వల్ల సమస్య పరిష్కారం కాదు. రూల్ బుక్ ప్రకారం ఏం చేస్తున్నారో చూద్దాం. మీడియా, విజిలెన్స్, కళాశాలల యాజమాన్యాలతో నిజనిర్ధారణ చేద్దాం. 100 శాతం కరెక్టుగా ఉందని ఈ కమిటీ నిర్ధారిస్తే ఆ కళాశాల కోసం తల తాకట్టు పెట్టయినా ఆ రోజే 100 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తా అన్నారు.

# ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ సర్కార్ దగా



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చే షాక్‌కి అసలు మూడేళ్లు రేవంత్ రెడ్డి ఈ పదవిలో ఉంటారో.. లేక మూడు నెలల్లోనే దిగిపోతారో తేలిపోతుందన్నా రు. రేవంత్ రెడ్డి పనితీరు చూసి.. ఢిల్లీలో వాళ్ల అధిష్టానం కూడా కత్తులు నూరుతోందంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజల తరఫున బుద్ధి చెప్పే అవకాశం జూబ్లీహిల్స్ ప్రజలకి వచ్చిందని ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటర్లు దిమ్మతిరిగే తీర్పు ఇస్తే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో తేలిపోతుందని కేటీఆర్ అన్నారు. ఒక్క సీటు కోసం సీఎం కూడా ప్రచారం చేస్తున్నారంటే.. వాళ్లు ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. దిల్లీలో రేవంత్‌పై నల్గొండ, ఖమ్మం నేతలు కత్తులు నూరుతున్నారని.. సీఎం కుర్చీకోసం కొందరు నేతలు సిద్ధమవుతున్నారన్నారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకుంటే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని.. అందర్నీ కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత తమదని పేర్కొన్నారు. ఉప ఎన్నిక ప్రచారం చివరి రోజు ఆదివారం సాయంత్రం యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. 'ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తీయని మాటలు చెప్పి.. తర్వాత పైసలు లేవని చేతులెత్తేస్తారు. ఆరు గ్యారంటీలతో అన్నివర్గాలను మోసం చేసిన వ్యక్తి జూబ్లీహిల్స్‌కు న్యాయం చేస్తారా? రెండేళ్ల క్రితం ఒకసారి మోసపోయినందుకే ఇప్పటికీ అవస్థలు పడుతున్నాం. కేసీఆర్ పదేళ్ల.. రేవంత్ రెండేళ్ల పాలనను చూసి ఆలోచించి ఓటేయాలి. భారత రాష్ట్ర సమితిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబితేనే ఆడబిడ్డలకు రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛను పథకాలు అమలవుతాయి. జూబ్లీహిల్స్‌లోని 4 లక్షల ఓటర్లకు.. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజలకు న్యాయం చేసే అవకాశం దక్కింది అన్నారు.

# కేసీఆర్ బాటలోనే రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు, రూ.4వేల నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు వంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



### కేంద్ర సాయంపై బహిరంగ చర్చకు సిద్ధం

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై బహిరంగ చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఏమీ చేయలేదంటూ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీజేపీ, కేంద్రంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తోందంటూ ఈ పార్టీలు కేంద్రంపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నాయని, కానీ వాస్తవాలు వేరేలా ఉన్నాయని తెలిపారు. 2014లో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను మంజూరు చేసిందని, 2023 జూన్ 7న తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం పాత్ర పేరిట బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తాను ప్రజెంటేషన్ ఇచ్చానని వివరించారు.
మరోసారి తెలంగాణ అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చ జరిగేవిధంగా సహకరించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు కిషన్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, అందుకే తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో బహిరంగ చర్చ జరిపేందుకు రెడీగా ఉన్నామన్నారు. బహిరంగ చర్చకు తేదీ, సమయం నిర్ణయించి వారిద్దరినీ ఆహ్వానించాలని ప్రెస్ క్లబ్‌ను కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి మాట్లాడే భాష పార్లమెంటరీ పద్ధతిలో ఉండేలా, సానుకూల చర్చ జరిగే విధంగా చూడాలని సూచించారు.

# గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోంది



హైదరాబాద్: దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందన్నారు. ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. 'జూన్ 6న చనిపోయారా.. 8న చనిపోయారా?' అన్నదీ సందేహంగానే ఉందన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు. " కేటీఆర్ వచ్చిన తర్వాత మరణవార్తను బయటకు చెప్పారు. గోపీనాథ్ 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారు. అలాంటి వ్యక్తి ఆస్పత్రిలో ఉంటే.. ఒక్క రోజు కూడా చూడటానికి టైమ్ ఇవ్వలేదు. ఒక్క అటెండర్‌ను కూడా పెట్టలేదు. గోపీనాథ్ జూన్ 8న చనిపోయారని చెప్పారు.
లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కేటీఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం. తల్లిగా ఎంతో బాధపడుతున్నా. సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ మాకు కనీసం సమాచారం ఇవ్వలేదు.
గోపీనాథ్ మొదటి భార్య, కుమారుడికి గుర్తింపు ఉండాలి కదా. మాలిని ఎంతో బాధపడుతోంది. ఎన్నో అవమానాలు పడింది. వద్దు అనుకుంటే మొదటి భార్యతో ఎప్పుడో విడాకులు తీసుకునేవాడు. అలా జరగలేదు అంటే.. సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కదా. నలుగురిలో నిరూపించుకోవాలనే బయటకు వచ్చాం. నా పెద్ద కొడుకు కూడా టికెట్ కోసం ప్రయత్నించాడు. గోపీనాథ్ తల్లిగా నాకు అడగాల్సిన హక్కులేదా? లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మా పేర్లు లేవని ఆగస్టు 11 నుంచి తహసీల్దార్ కార్యాయానికి వెళ్లి వస్తున్నాం. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు" అని అన్నారు.

### మాకు గుర్తింపు లేదు: తారక్

తమకు లీగల్‌గా ఎలాంటి గుర్తింపు లేదని గోపీనాథ్ మొదటి భార్యకుమారుడు తారక్ ఆవేదన వ్యక్తం చేశారు. " మా అమ్మతో చట్టపరంగా విడాకులు కాలేదు. తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న నాకు మొదటి సారి ఫోన్ చేశారు. ఎవరో తెలియకపోతే.. ఎందుకు ఫోన్ చేసినట్లు? గ్రాడ్యుయేషన్ డేకి రావాలని మా నాన్న అనుకున్నారు. కానీ, హఠాత్తుగా చనిపోయారు. సునీత నాకు ఫోన్ చేసి.. నువ్వు ఇండియా రావాల్సిన అవసరం లేదు. రెజ్యూమె పంపించు కేటీఆర్ అంకుల్ కంపెనీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. మా పెద్దనాన్న మీద అనవసర ఆరోపణలు చేస్తున్నారు. జూన్ 25న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అప్లై చేశారు. అప్పుడు అఫిడవిట్‌లో ఎవరి పేర్లు పెట్టారో నాకు తెలియదు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలి" అని కోరారు.

# పాతబస్తీలో డ్రగ్స్ రాకెట్ ఆగడాలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ విషయంలో పాతబస్తీ పోలీసులు కనీస విచారణ జరపడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయం తెలిసినా మజ్లిస్ పార్టీ ఒత్తిళ్లతో చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు.
పాతబస్తీలో హిందూ అమ్మాయిలు అత్యధికంగా చదువుకునే స్కూళ్లను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ ముఠా అరాచకాలు చేస్తోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన డ్రగ్స్ ముఠా అంతు చూడాలని, హిందూ బాలికల జీవితాలను కాపాడాలని, లేకపోతే పాతబస్తీలో వేలాది మంది హిందూ యువకులతో రక్షక దళాలను రంగంలోకి దింపుతామని హెచ్చరించారు. అవసరమైతే చట్టానికి లోబడి కేంద్ర బలగాలను కూడా పాతబస్తీలో మోహరింపజేయాల్సి ఉంటుందన్నారు. తానే స్వయంగా పాతబస్తీలో పాగా వేసి డ్రగ్స్ ముఠా అంతు చూస్తానని, అందుకు జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. పాతబస్తీలో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే కేరళ ఫైల్స్ సినిమాను తలపిస్తోందన్నారు. మొదట ఈ రాకెట్ ఓ స్కూల్‌లో ఒక అమ్మాయిని లక్ష్యంగా చేసుకొని బర్త్‌డే పేరుతో ముస్లిం అమ్మాయి ఇంటికి పిలిపించి తక్కువ డోస్ ఉన్న డ్రగ్స్ చాక్లెట్ తినిపించారని, ఆ తర్వాత ఆ చాక్లెట్లలో డ్రగ్స్ డోస్ పెంచి అలవాటు చేసి ఆరు రోజుల తర్వాత కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారన్నారు. అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు విచారణ చేయరని, ఫిర్యాదు చేసిన ఒకటి రెండ్రోజులకే ఆ అమ్మాయిలను ఇంటి వద్ద వదిలి వెళతారని, విచారణ జరపాలని అడిగితే మీ అమ్మాయి ఎట్లాగూ వచ్చింది కదా, ఇక విచారణ ఎందుకని కేసును క్లోజ్ చేస్తారని చెప్పారు. ఇలాంటి కేసులు అక్కడ చాలా ఉన్నాయన్నారు. పాతబస్తీ మజ్లిస్ అడ్డా కాబట్టి... ఒవైసీ చెప్పినట్టు నడుస్తోందని, మజ్లిస్ అండతో పోలీసులు డ్యూటీ నిర్వహించకుండా డబ్బులు దండుకుంటున్నా రన్నారు. ఈ గ్యాంగ్‌ను పట్టుకునే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, గోషామహల్ అధ్యక్షుడు ఉమా మహేందర్, బీజేపీ నేతలు ఎన్వీ సుభాశ్, జి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి తీవ్రత.?

హైదరాబాద్ : వానాకాలం ఇట్ల పూర్తయిందో లేదో చలి తీవ్రత ఒక్క సారిగా పెరిగిపోయింది. రెండు రోజులు తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. నిన్న మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎడతెరిపిలేని వర్షాలతో రెండు రాష్ట్రాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల మొంథా తుపాను తీవ్రత తగ్గిన తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. అయితే, తాజాగా చలి తీవ్రత పెరిగింది. వానాకాలం ఇట్ల పూర్తయిందో లేదో చలి తీవ్రత ఒక్క సారిగా పెరిగిపోయింది. సాయంత్రం 5గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఇక ఉదయం వేళల్లో చలి తీవ్రత పెరిగింది. ఉదయం 9గంటల వరకు చలి గజగజ వణికిస్తోంది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, నుంచి జోగులాంబ గద్వాల్ జిల్లా వరకు చలి సాధారణం కన్నా ఎక్కువగా ఉంటుంది. మరో 15రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణ పరిస్థితులే ఉండే అవకాశాలు ఉన్నాయి. నవంబర్ 11 నుండి 19 వరకు పది రోజులపాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా చలి ప్రభావం అధికమైంది. శనివారం అన్ని జిల్లాల్లోనూ 20 డిగ్రీలలోపే రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. హైదరాబాద్ లోనూ చలి గజగజ వణికిస్తుంది. ఉదయం 9గంటల వరకు పొగమంచు ప్రభావం ఉంటుంది. నగరం పరిధిలోని అత్యల్పంగా 14.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుందని, రాత్రి, ఉదయం వేళల్లో బయటకు వచ్చేవారు చలి తీవ్రత నుంచి పాటించాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.



# ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో మాదే అధికారం

## రాహుల్ గాంధీ

**బిహార్ :** భాజపా, ఆరెస్సెస్‌లు దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఇండియా' కూటమి మాత్రం దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు కృషి చేస్తోందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు కిషన్‌గంజ్‌లో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. రాష్ట్రంలో ఓట్ల చోరీని అడ్డుకుంటే.. 100 శాతం 'ఇండియా' కూటమిదే అధికారమని పేర్కొన్నారు. "కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీపై ఆధారాలు చూపించాం. కానీ.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లు సమాధానం ఇవ్వలేక పోయారు. ఎందుకంటే.. వాస్తవాలన్నీ ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చాయి. మోదీ, అమిత్ షాలు దేశంలో ఎక్కడికెళ్లినా.. చివరకు 'ఓట్ల చోరీ' విషయంలో దొరికిపోతారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో 'ఇండియా' కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. దీని కోసం యువత, రైతులు, కార్మికులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "దేశంలో ప్రధాని మోదీ, బిహార్‌లో సీఎం నీతీశ్ కుమార్ ఉపాధిని నాశనం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కోరుకోవడం లేదు. స్థానికంగా అనేక పంటలు పండుతాయి. కానీ, 20 ఏళ్లలో ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. ఎప్పుడైనా ప్రజలతో మాట్లాడితేనే కదా.. వారి అవసరాలు తెలుసుకునేది" అని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో విద్యారంగాన్ని మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.



# దేశంలో ఉగ్రదాడులకు కుట్ర

## ముగ్గురు అరెస్టు

**గుజరాత్ :** దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రదాడులకు చేసిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో దాడులకు ఆయుధాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏటీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 'ముగ్గురు అనుమానితులను అరెస్టు చేశాం. గతేడాది నుంచి వారిపై నిఘా ఉంచాం. ఆయుధాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వారిపై ఉన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రదాడులు చేయాలని ప్లాన్ చేశారు' అని పేర్కొన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇక, ఈ ఏడాది ప్రారంభంలో కూడా ఏటీఎస్ అధికారులు ఐదుగురు అల్-ఖైదా ఉగ్రవాదులను అరెస్టు చేశారు. నాడు ఆన్‌లైన్‌లో టెర్రర్ మాడ్యూల్‌ను నడుపుతున్నవారితో పాటు.. పాక్‌లోని ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి ఉన్న మహిళ కూడా వారిలో ఉంది. పాక్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు రావడంతో జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఇద్దరు ఎస్పీవోలపై వేటు పడింది. ఉగ్రవాదుల కార్యకలాపాలకు వీరు సాయం చేస్తున్నట్లు తేలడంతో విధుల నుంచి తొలగించామని అధికారులు తెలిపారు. ఎస్పీవోలైన అబ్దుల్ లతీఫ్, మహ్మద్ అబ్బాస్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. దోడా జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

# మునీర్‌కు అపరిమిత అధికారాలు

## పాక్ ప్రతిపక్షం ఆందోళనలు



**పాకిస్థాన్ :** పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు అపరిమిత అధికారాలను కట్టబెడుతూ ప్రభుత్వం పావులు కదపడంపై ఆ దేశ ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాక్ రాజ్యాంగానికి 27వ సవరణ చేయడానికి నిరసనగా ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. వాస్తవానికి ఈ చర్యతో ఆర్టికల్ 243లో మార్పులు చేసి మిలటరీ కమాండ్‌లో అత్యున్నత పదవిని సృష్టించనున్నారు. దీంతోపాటు ఇప్పటికే ఉన్న ఛైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ పదవిని తొలగించి.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్ణయాలపై ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్, తెహ్రీకే తౌఫిజ్ అయినే పాకిస్థాన్ సంస్థలు జాతీయ స్థాయిలో ఆందోళనలకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ నిర్ణయంతో పాక్ రాజ్యాంగం పునాదులే కదిలిపోతాయని ఆరోపించారు. టీటీఏపీ నేత ఆలమ్ రజా నసీర్ అబ్బాస్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలు మొత్తం కుంగిపోతున్నాయని ఆరోపించారు. దేశం మొత్తం 27వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా కదం తొక్కాలని కోరారు. ఇక పష్తూన్‌ఖవా మిల్లీ అవామీ పార్టీ నేత మహమూద్ ఖాన్ మాట్లాడూ రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలకు నిరసనలు చేయడానికి మించి మరో అవకాశం లేదని చెప్పారు. మరోవైపు పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన 27వ రాజ్యాంగ సవరణపై దేశ వ్యాప్తంగా కూడా మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. ఆర్టికల్ 243లో మార్పులు సుప్రీం కోర్టుకు మృత్యువుతో సమానమని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు సీడీఎఫ్ పదవిని సృష్టిస్తే.. సైనక దళాల్లో కూడా బ్యాలెన్స్ తప్పుతుందని నిపుణులు చెబుతున్నారు.

# ఒక్కో వ్యక్తికి 2వేల డాలర్లు ఇస్తాం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, వీటిని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలవుతుండగా, అక్కడి అధ్యక్షుడికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా అధ్యక్షుడి అధికారాలపై సందేహాలు వ్యక్తం చేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలేం జరుగుతోందని, ఇదంతా హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. అయితే, సుంకాల వల్ల భారీ ఆదాయం సమకూరుతోందని, డివిడెండ్ కింద ఒక్కో అమెరికన్‌కు కనీసం 2వేల డాలర్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

### ఒక్కో వ్యక్తికి 2వేల డాలర్లు..

"సుంకాలకు వ్యతిరేకంగా మాట్లాడేవారు మూరులు. ఇప్పుడు మనది ప్రపంచంలో అత్యంత ధనిక, గౌరవనీయమైన దేశం. ద్రవ్యోల్బణం దాదాపు లేదు. రికార్డు స్థాయిలో స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తున్నాయి. లక్షల డాలర్లు వస్తున్నాయి. త్వరలోనే 37 ట్రిలియన్ల డాలర్ల రుణాన్ని చెల్లించడం మొదలుపెడతాం. డివిడెండ్ కింద ఒక్కో వ్యక్తికి కనీసం 2వేల డాలర్లు చెల్లిస్తాం" అని పేర్కొన్నారు.

### అసలేం జరుగుతోంది..?

"ఏదైనా దేశంతో వాణిజ్య కార్యకలాపాలు నిలిపేసేందుకు, లైసెన్స్ ఇవ్వడానికి అమెరికా అధ్యక్షుడికి ఆమోదం ఉంది. అలాంటప్పుడు జాతీయ ప్రయోజనాల కోసం విదేశంపై సాధారణ సుంకాలు విధించడం సాధ్యం కాదా..? ఇదంతా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. ఇతర దేశాలు మనపై సుంకాలు విధిస్తున్నప్పుడు మనమెందుకు వేయకూడదు..? సుంకాల కారణంగానే అమెరికాలోకి వ్యాపారాలు వెల్లువెత్తుతున్నాయి. సుప్రీం కోర్టుకు ఇది తెలియదా? అసలేం జరుగుతోంది..?" అని ట్రంప్ మండిపడ్డారు. ట్రంప్ సుంకాల విధింపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు ఇటీవల విచారించింది. ఈ సందర్భంగా దిగుమతి సుంకాలు మార్చడం, కొత్తవి విధించేందుకు అత్యవసర చట్టం ద్వారా అధ్యక్షుడికి అపరిమిత అధికారాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు లేవనెత్తింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# ఫిలిప్పీన్స్‌ను వణికిస్తున్న 'ఫుంగ్-వాంగ్'



**ఫిలిప్పీన్స్ :** ఫిలిప్పీన్స్‌ను 'ఫుంగ్-వాంగ్' సూపర్ టైఫూన్ వణికిస్తోంది. అతి తీవ్ర తుపాను ధాటికి గంటకు గరిష్ఠంగా 230 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తున్నాయి. ఈశాన్య తీరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటివరకు ఆయా ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటం, 5 మీటర్ల ఎత్తువరకు అలలు ఎగిసిపడే ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాదాపు 10 లక్షల మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొత్తంగా మూడు కోట్ల మందిపై ఈ తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందని పౌర రక్షణ కార్యాలయం అంచనా వేసింది. దేశంలో అత్యధిక జనాభా కలిగిన లూజాన్ ద్వీపంలోని అరోరా ప్రావిన్స్‌లో ఇది తీరాన్ని తాకింది. స్థానికంగా 'ఉవాన్' అని పిలుస్తున్న ఈ తుపాను.. 1800 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మూడింట రెండోవంతు దేశ భూభాగం దీని పరిధిలో వస్తుందని అంచనా వేశారు. కటండువానెస్ ప్రావిన్స్‌లో సంభవించిన మెరుపు వరదల్లో ఓ వ్యక్తి మృతి చెందాడు. సమర్ ప్రావిన్స్‌లోని కాట్‌బాలొగన్ నగరంలో ఇల్లు కూలిపోయి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. వర్షాలు, గాలుల తీవ్రతతో సమీపంలో ఉన్నవికూడా కనిపించని పరిస్థితి నెలకొన్నట్లు అధికారులు తెలిపారు. ఆయా ప్రదేశాల్లో 19 మందిని సహాయక సిబ్బంది కాపాడినట్లు చెప్పారు. భారీ వర్షాల కారణంగా బికోల్, తూర్పు విసాయాస్‌లను వరదలు ముంచెత్తాయి. కటండువానెస్‌లోని గిగ్మోటో, ఇసాబెలాలోని డైనపిగ్ వంటి తీరప్రాంతాల్లో రాకసి అలలు విరుచుకుపడ్డాయి. వేలాది ఇళ్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అనేక చోట్ల చెట్లు కూలిపోయాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. ముందుజాగ్రత్త చర్యగా 380కుపైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలు రద్దు చేశారు. ఉత్తర ప్రావిన్సుల్లోని విద్యాసంస్థలు, కార్యాలయాలకు సోమ, మంగళవారాలు సెలవు ప్రకటించారు. ఈ ఏడాదిలో ఫిలిప్పీన్స్‌ను తాకిన 21వ తుపాను ఇది. ఇటీవలే స్థానికంగా కల్మేగీ తుపాను బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. దాదాపు 224 మంది మృతి చెందారు.

# వరికోత యంత్రానికి విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరి మృతి

**పశ్చిమగోదావరి :** వరి కోత యంత్రాన్ని వాహనంపై తీసుకెళ్తున్న క్రమంలో విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కథనం.. పశ్చిమగోదావరి జిల్లా పేకేరు, రాపాక గ్రామాలకు చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(57), గెద్దం సందీప్(17)లు కాకినాడ జిల్లా సింగరంపాలెంలో వరి కోతలు కోసేందుకు యంత్రాన్ని వాహనంపై ఆదివారం తీసుకెళ్తున్నారు. రామయ్యపాలెం వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు యంత్రానికి ఉన్న గొట్టానికి తగిలాయి. ఇది గమనించిన వ్యాన్ డ్రైవర్ సింహాద్రి అప్పన్న వాహనం దిగేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వాహనానికి ముందు ద్విచక్ర వాహనంపై పైలట్‌గా వెళ్తున్న గెద్దం సందీప్.. ఇది చూసి హెచ్చరించడానికి వ్యాన్ వద్దకు వచ్చాడు. వ్యాన్‌కు సైతం విద్యుత్తు ప్రసరించడంతో షాక్‌కు గురై ఇద్దరూ ఘటనాస్థలిలోనే మృతి చెందారు.

# కాసుల కోసమే నీలిచిత్రాలు

- హాస్టల్ బాత్‌రూంలో రహస్య కెమెరా కేసు..
- విచారణలో ఒప్పుకున్న కిలేడీ నీలాకుమారి
- ఢిల్లీలో మరో ప్రియుడు అరెస్టు
- గత నెల 19న బెంగళూరులో కెమెరా కొనుగోలు



**హొసూరు:** కారు కొనాలి, ఆడంబరంగా జీవించాలి, అందుకు డబ్బు కావాలి, దీంతో నీలిచిత్రాల తయారీ ఆలోచన పుట్టినట్లు నిందితురాలు తెలిపింది. హొసూరులోని టాటా ఎలక్ట్రానిక్ కంపెనీ మహిళా సిబ్బంది నివసించే హాస్టల్లో రహస్య కెమెరా కేసులో కొత్త కొత్త విషయాలు బయటపడుతున్నాయి. గత మంగళవారం రాత్రి తమ వీడియోలు బయటకు రావడంతో వేలాది మంది మహిళలు, యువతులు హాస్టల్ ముందు ధర్నా చేయడం తెలిసిందే. మహిళా కార్మికుల కోసం పరిశ్రమ ఇక్కడ 11 అంతస్తులతో 8 భవనాలను నిర్మించింది. ఘటన జరిగిన హాస్టల్లో సుమారు 2 వేల మందికి పైగా మహిళా కార్మికులు బస చేస్తున్నారు. ఒక్కో గదిలో నలుగురు ఉంటున్నారు.
4వ బ్లాక్, 8వ అంతస్తులోని బాత్‌రూంకి వెళ్లిన మహారాష్ట్రకు చెందిన యువతి అనామికకు రహస్య కెమెరా కనిపించడంతో అవాక్కైంది. వెంటనే అదే గదిలో ఉంటున్న ఒడిశాకు చెందిన నీలా కుమారి గుప్తాకు తెలిపింది. నిజానికి నీలాకుమారినే ఈ కెమెరాను రహస్యంగా ఏర్పాటు చేసింది. వెంటనే నీలా బాత్‌రూంకు వెళ్లి కెమెరాను లాగి కిందకు పడేసింది. అనామిక హాస్టల్ వార్డన్ సరితకు చెప్పగా తాను చూసుకొంటానని, బయట ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించింది. ఈ ఘటనతో ఆవేశానికి గురైన తోటి కార్మికులు ఏకమై ఆందోళన చేపట్టారు.

### పంజాబ్, ఢిల్లీ లింకులు

జిల్లా ఎస్పీ తంగదురై, ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తన ప్రియుడు బెంగళూరుకు చెందిన సంతోష్ కుమార్ చెప్పడంతోనే నీలాకుమారి గుప్తా రహస్య కెమెరాను అమర్చినట్లు తెలిపింది. నీలా కుమారి సెల్‌ఫోన్‌ను తనిఖీలు చేశారు. నివ్వెరపోయే అంశాలు ఇందులో బయటపడ్డాయి, ఆమె పంజాబ్‌కి చెందిన రవిప్రతాప్‌సింగ్ అనే వ్యక్తితో గత నాలుగేళ్లుగా ప్రేమాయణం నడుపుతోంది. జిల్లా పోలీసులు ఢిల్లీకి వెళ్లి నిజాముద్దీన్ రైల్వేస్టేషన్ సమీపంలో అతని సెల్‌ఫోన్ సిగ్నల్‌ను గుర్తించి అరెస్ట్ చేసి శుక్రవారం సాయంత్రం ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

### జల్సాల కోసం ..

సంతోష్‌ను పైపైన ప్రేమిస్తున్నట్లు నీలాకుమారి నటిస్తూ, నిజమైన ప్రియుడు పంజాబ్ రాష్ట్రం లూథియానాకు చెందిన రవిప్రతాప్‌సింగ్‌ను ప్రేమిస్తూ, తన జీతమంతా అతనికే పంపుతూ వచ్చింది. గత నెల 19వ తేదీ బెంగళూరుకు రప్పించుకొంది. నీతో కారులో షికార్లు చేయాలనిపిస్తోందని, జల్సాగా బతకాలని ఉందని ప్రియుడు అన్నాడు, అయితే డబ్బు సంపాదనకు తన వద్ద ఓ పథకం ఉందని ఆమె చెప్పింది. హాస్టల్ బాత్‌రూంలో రహస్య కెమెరా అమర్చుతానని, ఆ వీడియోలు తీసి, వారి ఫోన్ నంబర్‌ను కూడా పంపుతానని, వారికి ఈ వీడియోలు పంపి బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో పాటు నీలిచిత్రాలుగా కూడా విక్రయించవచ్చునని నీలాకుమారి తెలిపింది. ఈ పథకం ప్రకారం ఓ బెంగళూరులో కెమెరాను, ఇతర ఉపకరణాలను కొనుగోలు చేసుకొచ్చిన ఆమె బాత్‌రూంలో అమర్చింది. కానీ కెమెరాను గుర్తించడంతో దొరికిపోయామని 4న రాత్రి 12.40 గంటల సమయంలో రవిప్రతాప్‌సింగ్‌కు ఫోన్‌చేసి చెప్పింది. ప్రస్తుతం నీలాకుమారి, ఆమె ఇద్దరు ప్రియులు పోలీసుల విచారణలో ఉన్నారు. హొసూరు ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది.



# యాదగిరిగుట్ట ఆలయానికి పోటెత్తిన భక్తులు

**భువనగిరి:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తిక మాసంతో పాటు ఆదివారం సెలవుదినం కావడంతో రద్దీ పెరిగింది. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది.

# హెచ్‌సీఏలో సెలక్షన్ల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్:** హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్)లో జరుగుతున్న జూనియర్, సీనియర్ సెలక్షన్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "గ్రామీణ స్థాయి క్రికెటర్లకు అవకాశం కల్పించట్లేదని క్రీడాకారుల తల్లిదండ్రులు నన్ను కలిశారు. త్వరలో హెచ్‌సీఏపై చర్యలు ఉండబోతున్నాయి. బీసీసీఐకి కూడా ఫిర్యాదు చేస్తాం. సెలక్షన్ కమిటీలోని కొందరు రూ. లక్షలు తీసుకున్నట్లు తల్లిదండ్రులు చెప్పారు. గతంలో బాగా ఆడేవారిని కూడా ఎంపిక చేయలేదని వారు ఆరోపించారు" అని బండి సంజయ్ తెలిపారు.

# తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆపరేషన్

## ఐదు రాష్ట్రాల్లో 81 మంది అరెస్టు

**హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఐదు రాష్ట్రాల్లో కీలక ఆపరేషన్ చేపట్టింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 81 మందిని ఏపీ, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలో పోలీసులు అరెస్టు చేశారు. నిందితులపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.95 కోట్ల విలువైన మోసాలు చేసినట్లు గుర్తించారు. నిందితుల్లో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలున్నారు. 58 మంది మ్యూల్ ఖాతాదారులున్నట్లు గుర్తించారు. వారి నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఖాతాలోని రూ.కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు. దీన్ని సైబర్ సెక్యూరిటీ బ్యూరో బాధితులకు అందించనుంది.

# పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్త

## సీపీ సజ్జనార్

**హైదరాబాద్:** రోజూ రూ.కోట్ల విలువైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. సిటీ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో చాలా యాప్‌ల్లో బాధితులు మోసపోతున్నారని పేర్కొన్నారు. డబ్బులు ఊరికే రావని.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీకే ఫైల్స్ వల్ల కూడా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల్లో డబ్బు నష్టపోయిన వెంటనే బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బిహార్ ప్రచారానికి తెర

## ఈ నెల 11న రెండో దశ పోలింగ్

**న్యూఢిల్లీ:** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. ప్రచార పర్వం ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఇన్నాళ్లూ రాజకీయ పార్టీల నినాదాలు, ప్రసంగాలతో హోరెత్తిపోయిన గ్రామాలు, పట్టణాలు నిశ్శబ్దంగా మారిపోయాయి. చివరిదైన రెండో దశ పోలింగ్ ఈ నెల 11వ తేదీన 122 నియోజవర్గాల్లో జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 6వ తేదీన 121 స్థానాల్లో జరిగిన తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశలో కీలక నేతలు పోటీపడుతున్నారు. బిహార్ ఎన్నికల చరిత్రలో 5 శాతానికి మించి ఓటింగ్ పెరిగిన ప్రతిసారీ.. అది అధికార మార్పిడికే దారితీసిందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. ఈసారి భారీ ఓటింగ్ నమోదు కావడం తమకే అనుకూలమని ఇరుపక్షాలూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రెండో దశలో పోలింగ్ జరుగనున్న 122 నియోజకవర్గాలు అత్యంత సంక్లిష్టమైనవి. ఇక్కడ ప్రచారం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కుల సమీకరణాలు, ఓట్ల చీలిక వంటి అంశాలే అభ్యర్థుల గెలుపోటములను శాసించనున్నాయి. రెండో దశలో సీమాంచల్ అత్యంత కీలకం. కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కతిహార్ వంటి జిల్లాలున్న ఈ ప్రాంతంలో ముస్లిం మైనారిటీల జనాభా ఎక్కువ. ఇది దశాబ్దాలుగా ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమికి కంచుకోట. అయితే, 2020 నాటి ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ నేతత్వంలోని ఎంఐఎం ఇక్కడ 5 స్థానాలు గెలుచుకొని మహాగఠ్‌బంధన్ ఓట్లను చీల్చింది. మైనారిటీల ఓట్లను ఆకర్శించేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతుండగా.. ఎంఐఎం సైతం అదే ఓటు బ్యాంకుకు గాలం వేస్తోంది. ఈ 'ఓట్ల చీలిక'అంతిమంగా ఎన్డీఏకు లాభం చేకూరుస్తుందనడంలో సందేహం లేదు. రెండో దశలోనూ కులమే ప్రధాన పాత్ర పోషిస్తోంది.

### సమస్యాత్మక ప్రాంతాలు

రెండో దశలో పోలింగ్ జరగనున్న పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢీ వంటి జిల్లాలు నేపాల్ సరిహద్దును ఆనుకొని ఉన్నాయి. ఇక్కడ ఎన్నికల నిర్వహణ భద్రతా బలగాలకు పెద్ద సవాల్. ఎన్నికలకు 72 గంటల ముందే నేపాల్ సరిహద్దును మూసివేశారు. అసాంఘీక శక్తులు సరిహద్దులు దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మరోవైపు సీమాంచల్ ప్రాంతం మతపరంగా అత్యంత సున్నితమైనది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రాంతాల్లో భారీగా సాయుధ బలగాలను మోహరించింది. ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 14న ఫలితాల కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

“ఫోన్ కొని 4 ఏళ్లు దాటింది. ఒక్క గీత కూడా పడలేదు. బ్యాటరీ బ్యాకప్ కూడా పర్లేదు. మరో ఏడాది లాగించేస్తే.. ఎంచక్కా ఏ ఆఫర్ల సమయంలోనో కొత్త ఫోన్ కొనుక్కోవచ్చు” వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన స్మార్ట్‌ఫోన్ విషయంలో చాలామంది యూజర్ల అభిప్రాయం దాదాపు ఇలానే ఉంటుంది. కేవలం చూడ్డానికి, వాడ్డానికి మాత్రం స్మార్ట్‌ఫోన్ ఉంటే సరిపోతుందా? మరి అప్‌డేట్స్ మాటేంటి? అసలు అప్‌డేట్స్ పూర్తిగా నిలిచిపోతే వచ్చే ఇబ్బందులేంటో కూడా తెలుసుకోవాల్సిందే. అంతేకాదు ఎప్పటికప్పుడు స్మార్ట్‌ఫోన్‌ను మార్చే ఉద్దేశం లేనివారైతే ఏం చేయాలో ఈ కథనంలో తెలుసుకుందాం.



# మీ ఫోన్‌కు అప్‌డేట్లు ఆగిపోయినా వాడుతున్నారా?

## ఇవి తెలుసుకోవాల్సిందే!


స్మార్ట్‌ఫోన్ వాడే వారికి రెండు రకాల అప్‌డేట్స్ వస్తుంటాయి. ఒకటి ఆండ్రాయిడ్ అప్‌డేట్స్. రెండోది సెక్యూరిటీ అప్‌డేట్స్. స్మార్ట్‌ఫోన్ కంపెనీలు దాదాపు ఏడాదికోసారి ఓఎస్ అప్‌డేట్స్ విడుదల చేస్తుంటాయి. దీనికి ఒకటి కంటే ఎక్కువ %+దీ% డేటా అవసరం అవుతుంది. సెక్యూరిటీ అప్‌డేట్స్ అనేవి నెల నెలా వస్తుంటాయి. వీటికి కొన్ని ఎంబీల డేటా అవసరం పడుతుంది. యాపిల్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్లను రిలీజ్ చేస్తూ ఉంటుంది. స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఓఎస్ అప్‌డేట్స్‌ను ఆపేసిన కొన్నాళ్లకు సెక్యూరిటీ అప్‌డేట్లను నిలిపివేస్తాయి. అప్‌డేట్లు వస్తున్నా డేటా ఖర్చయిపోతుందన్న కారణంతో కొందరు తమ స్మార్ట్‌ఫోన్‌ను అప్‌డేట్ చేయకుండా వదిలేస్తుంటారు. అలాంటి వారూ ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే.

### ఆండ్రాయిడ్ అప్‌డేట్స్

కొత్త కొత్త ఫీచర్లతో గూగుల్ సంస్థ.. ఓఎస్ అప్‌డేట్స్‌ను విడుదల చేస్తుంటుంది. ప్రస్తుతం ఫోన్లన్నీ ఆండ్రాయిడ్ 15తో వస్తున్నాయి. చాలా ఫోన్లలో ఆండ్రాయిడ్ 14 నడుస్తోంది. అప్‌డేట్ చేసుకున్న ప్రతిసారీ కొత్త లుక్, ఫీచర్లు యూజర్లను పలకరిస్తుంటాయి. గూగుల్ రిలీజ్ చేసిన ఓఎస్ అప్‌డేట్‌ను.. మొబైల్ తయారీ కంపెనీలు తమ యూఐకి అనుగుణంగా చిన్న చిన్న మార్పులతో యూజర్లకు విడుదల చేస్తుంటాయి. శాంసంగ్ అయితే వన్‌యూఐ, వన్‌ప్లస్ అయితే ఆక్సిజన్ ఓఎస్, షావోమి అయితే హైపర్ ఓఎస్.. ఇలా అన్నమాట. ఒకప్పుడు ఒకట్రెండు అప్‌డేట్స్ మాత్రమే అందించేవి. ఇప్పుడు చాలావరకు కంపెనీలు నాలుగైదు ఓఎస్ అప్‌డేట్స్ ఇస్తామని హామీ ఇస్తున్నాయి. పిక్సల్ ఫోన్లకు దాదాపు ఏడేళ్ల పాటు గూగుల్ ఓఎస్ అప్‌డేట్స్‌ను ఇస్తోంది. శాంసంగ్, యాపిల్ సంస్థలు సైతం (ఫోన్లను బట్టి) ఐదారేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్ ఇస్తామని చెబుతున్నాయి. ప్రస్తుతం మీ ఫోన్‌లో ఏ వెర్షన్ రన్ అవుతోందో తెలియాలంటే మీ ఫోన్ సెట్టింగ్స్‌లోని అబౌట్ ఫోన్‌లోకి వెళితే అక్కడ చూపిస్తుంది.

### ఆగిపోతే

ఇంతకుముందు చెప్పుకున్నట్లు కంపెనీ హామీ ఇచ్చిన ఓఎస్ అప్‌డేట్స్ అయిపోయాక ఇకపై కొత్తగా ఎలాంటి అప్‌డేట్స్ ఇవ్వవు. అంతమాత్రాన ఫోన్ పనిచేయకుండా ఏమీ ఆగిపోదు. కానీ, ఆండ్రాయిడ్‌లో వచ్చే కొత్త కొత్త ఫీచర్లు నిలిచిపోతాయి. ఇంకా కొన్నాళ్లు ఆగితే యాప్ డెవలపర్లు పాత ఫోన్లకు తమ సపోర్టును నిలిపివేస్తాయి. వాట్సప్ వంటి సంస్థలు ఏటా సపోర్టును నిలిపివేసే ఫోన్ల జాబితాను విడుదల చేస్తుంటాయి. ఎస్‌బీఐ సైతం ఆండ్రాయిడ్ 12కు ముందున్న ఆండ్రాయిడ్ వెర్షన్లకు సపోర్ట్‌ను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. కాబట్టి ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌డేట్స్ ఆగిపోయిన వెంటనే కాకపోయినా.. కొన్నాళ్లకైనా కొత్త ఫోన్ కొనాల్సిందేనన్నమాట!




### సెక్యూరిటీ అప్‌డేట్స్

దీర్ఘకాలం పాటు మీ ఫోన్‌ను ఎలాంటి అవాంతరాలూ లేకుండా వాడుకోవాలంటే సెక్యూరిటీ అప్‌డేట్స్ కీలకం. గూగుల్ నెలవారీ సెక్యూరిటీ అప్‌డేట్లను విడుదల చేస్తుంటుంది. భద్రతాపరమైన లోపాలు తలెత్తినప్పుడు మధ్యలో కూడా ఈ సెక్యూరిటీ అప్‌డేట్లు వస్తుంటాయి. సాధారణంగా ఓఎస్ అప్‌డేట్స్ ఆగిపోయిన ఒకట్రెండేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్లు కొనసాగుతాయి. మీ ఫోన్‌కు ఎన్నేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ కొనసాగిస్తామనేది ఫోన్ కొనుగోలు సమయంలోనే కంపెనీ చెబుతుంది.



### అప్‌డేట్స్ నిలిచిపోతే..?

సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో ఆర్థిక మోసాల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ఈ సెక్యూరిటీ అప్‌డేట్స్ ఎంతో కీలకం. డేటా చౌర్యం, హ్యాక్‌లు, సైబర్ దాడుల నుంచి రక్షించడంలో వీటిదే కీలక భూమిక. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో జరిపే దాడుల నుంచి ఈ సెక్యూరిటీ అప్‌డేట్లు మనల్ని కాపాడతాయి. ఈ సెక్యూరిటీ అప్‌డేట్స్ నిలిచిపోయినా.. వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడంలో విఫలమైనా సైబర్ నేరగాళ్లకు స్వయంగా మనమే ద్వారాలు తెరిచినవాళ్లం అవుతాం.

### కొనుగోలు చేసేటప్పుడే..

మనలో చాలామందికి స్మార్ట్‌ఫోన్‌ను తరచూ మార్చే అలవాటు ఉంటుంది. మరికొందరు మాత్రం ‘నడిచినంత కాలం చూద్దాంలే’ అనే ధోరణిలో ఉంటారు. కాబట్టి ఫోన్ కొనేటప్పుడే మీరు ఎన్నాళ్ల పాటు ఫోన్ వాడాలనుకుంటున్నారనే దానిపై స్పష్టత ఉండాలి. దీర్ఘకాలం ఫోన్ వాడేవారైతే ఎక్కువ ఆండ్రాయిడ్, సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇచ్చే ఫోన్లు ఎంచుకోవడం మంచిది. మన్నికైనా స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమే. ముఖ్యంగా ఆఫర్‌లో తక్కువకు దొరుకుతోందని ఒకట్రెండేళ్ల క్రితం ఫోన్లను కొనుగోలు చేస్తే.. ఆ మేరకు అప్‌డేట్లను కూడా కోల్పోతున్నామన్న విషయాన్ని గమనించాలి.





## కస్తాల రామ తులశమ్మ మరణం తీరని లోటు

**టిజిఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరావు, వేలాద్రి**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అభ్యుదయ భావాలు కలిగిన రామ తులశమ్మ మరణం కుటుంబానికి తీరని లోటని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టిజిఓ) ఖమ్మం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు,మోదుగు వేలాద్రి అన్నారు.టీజీవో ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాతృమూర్తి రామతులశమ్మ ఇటీవల మరణించగా ఆదివారం వారి స్వగ్రామం వైరా మండలంలోని కొండకొడిమ గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరై ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళిలు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన రామతులశమ్మ తన కుమారులను సమాజంలో ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం సత్యనారాయణకి మనో ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో టిజిఓ అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్,హౌసింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.విజయ్ కుమార్,జిల్లా సంక్షేమ అధికారిణి గుడికందుల జ్యోతి,రిటైర్డ్ ఎంపీడిఓ వెంకటపతి రాజు, హెచ్ డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు రుక్మారావు,టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు అంతోటి తిరుపతిరావు,మోదుగు వెంకటేశ్వర్లు, గురుకుల రెసిడెన్షియల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి దామోదర్,టీఎన్జీవో రఘునాథపాలెం యూనిట్ అధ్యక్షులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

**బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావానికి పంటలు నష్టపోయిన రైతులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని నేలకొండపల్లి బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు.మండలంలోని బుద్దారం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి నీట మునిగి రైతులకి కన్నీటిని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.పంట పెట్టుబడి కోసం అప్పు చేసి పంటలను సాగు చేస్తే అకాల వర్షంతో పంట మొత్తం నీటి పాలైందని తెలిపారు.రైతులు పంట నష్టపోయి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే అధికార పార్టీ నాయకులు పంటలను సందర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకి ఎకరానికి నలభై వేలు,కౌలు రైతుకు ఎకరానికి యాభై వేల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించాలని కోరారు.వ్యవసాయ అధికారులు పంట నష్టం పై సమగ్రంగా విచారణ చేపట్టి అర్హులైన రైతులకి పరిహారం అందించాలని తెలిపారు.లేనియెడల బిజెపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభ చాటిన కూసుమంచి బిసి గురుకుల విద్యార్థులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం జిల్లా మధిరలోని బోనకల్ జూనియర్ కళాశాలలో నవంబర్ 6 నుండి 8 వరకు నిర్వహించిన ఎంజేపీ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కూసుమంచి బిసి గురుకుల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్ సాధించారు.ఈ పోటీల్లో 800 మీటర్ల రేసులో జి.అశోక్ 1వ స్థానం,1500 మీటర్ల రేసులో బి.జశ్వంత్ 1వ స్థానం,జి.అశోక్ 2 వ స్థానం,షాట్ పుట్ లో ఎన్.సాయి కృష్ణ 1వ స్థానం,బి.జశ్వంత్ 3వ స్థానం, లాంగ్ జంప్ లో ఎస్.మణి శంకర్ 2వ స్థానం,ఏ.నాగరాజు 3వ స్థానం,100 మీటర్లలో ఏ.నాగరాజు 2వ స్థానం,400 మీటర్లలో జి.అశోక్ 2వ స్థానం,టెన్నికాయిట్ ఆటలో ఎం.వినయ్,కె.గౌతమ్ సింగ్ 2వ స్థానం సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని తీసుకువచ్చారని ప్రధానోపాధ్యాయులు పేరబోయిన మల్లయ్య తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ బి.వెంకటేశ్వర్లు,వార్డెన్ వెంకట నర్సయ్య,పీఈటీ నరసింహ,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు తగ్గించాలి

**పాఠశాల విద్యాసంచాలకుడికి ఎస్టీఎఫ్ వినతి**

**హైదరాబాద్:** పాఠశాలల్లో బోధన కంటే ఉపాధ్యాయులు ఇతర పాలనాపరమైన పనులతో ఎక్కువ సమయం గడపాల్సి వస్తోందని, దీనిని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ రాష్ట్ర పాఠశాల ఉపాధ్యాయుల సమాఖ్య(ఎస్టీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సైదులు, యు.పోచయ్య పాఠశాల విద్యాసంచాలకుడు నవీన్ నికోలస్‌ను హైదరాబాద్‌లోని సంచాలక కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పారిశుధ్య పనులు, డేటా అప్‌లోడింగ్, మరుగుదొడ్ల పరిశుభ్రత బాధ్యతలు, పరిసరాల పరిశుభ్రత లాంటి బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి బోధనకే పరిమితం చేయాలన్నారు. దీంతో విద్యా ప్రమాణాలు మెరుగవుతాయని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## కలెక్టర్ స్పందించినా అధికారులు చర్యల్లో నిర్లక్ష్యం

- ప్రజావాణిలో ప్రజలకు ఏది భరోసా...?
- దరఖాస్తుదారుల్లో తీవ్ర అసంతృప్తి
- బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్



**ములుగు, రాజముద్ర న్యూస్ :** సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ఆశించిన భరోసా ఇవ్వడం లేదని ఒకే సమస్యపై పలుమార్లు కలెక్టరేట్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి, అధికారులు మొక్కుబడిగా అర్జీలు స్వీకరిస్తుండడంతో పరిష్కారానికి పడిగాపులు తప్పట్లేదని అర్జీదారులు నిట్టూరుస్తున్నారు. పరిష్కారానికి నోచుకోని పదుల సంఖ్యలో ఉన్న దరఖాస్తులు, అధికారుల పనికి అద్దం పడుతున్నాయని బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

**నివేదికల్లోనే పరిష్కారాలు..!**

ప్రజావాణిలో సమస్యలు మిగిలిపోతున్నాయని,అధికారులు వెల్లడించే నివేదికల్లో మాత్రం పరిష్కారమవుతున్నట్లే చూపిస్తున్నారు.కానీ కొంతమంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం పదులసార్లు కలెక్టరేట్ మెట్లు ఎక్కిన దాఖలాలున్నాయన్నారు.

**రికార్డుల్లో లేకున్నా ఇంటి దృవీకరణ పత్రం జారీ**

రికార్డుల్లో లేకున్నా ఇంటి దృవీకరణ పత్రం జారీ చేశారని పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసినప్పటికి స్పందించని అధికారులు, జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీగా ఏర్పడక ముందు 2019 సంవత్సరంలో జిల్లా కేంద్రానికి చెందిన ఒక మహిళ గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సంప్రదించి తమపై ఉన్న ఇంటిపై ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరగా స్పందించిన అప్పటి పంచాయితీ కార్యదర్శి రికార్డులను పరిశీలించి అందులో పేరు లేకున్నా ఉన్నట్లుగా చిత్రీకరించి సదరు మహిళపై ఇంటి నెంబర్తో కూడిన ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. దీంతో సదరు మహిళ ఆ ధ్రువీకరణ పత్రంతో ఇంటిని తన భర్త పేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేపించారని.గ్రామ పంచాయితీ రికార్డులలో పేరు లేకున్నా ఎటువంటి శిస్తుకట్టకున్న రికార్డులో ఉన్నట్టుగా అప్పటి పంచాయితీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరిగిందని, కార్యదర్శి ధ్రువీకరణ పత్రం ఇచ్చాడా లేదా ఎవరైనా అధికారి పేరున సృష్టించారా పూర్తి విచారణ జరపాలని కోరారు.ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి కేంద్రీకరించి పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవ విషయాలు వెలుగులోకి వస్తాయని శ్రీకాంత్ తెలిపారు.



## సుధా బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవం

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో హెడ్ ఆఫీస్ భవనం లో నిర్వహించిన సుధా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల అధికారి మురళీ రమణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ గత పది రోజులుగా కొనసాగి ప్రశాంతంగా ముగిసింది.బ్యాంక్ చైర్మన్ గా మీలా మహదేవ్ ,వైస్ చైర్మన్ గా కక్కిరేణి చంద్ర శేఖర్ ఎన్నికైనారు. గత పాలకవర్గంలో ఉన్న డైరెక్టర్లు కక్కిరేణి చంద్రశేఖర్,డాక్టర్ మీలాసందీప్.అడ్వకేట్ ఏపూరి శ్రవణ్ కుమార్,బాణావత్ సుజాత, తిరిగి ఎన్నిక కాగా,కొత్తగా అప్పం శ్రీనివాస్ ,డాక్టర్ మిన్నా విజయలక్ష్మి, పటేల్ నరసింహారెడ్డి,తోట శ్యాంప్రసాద్ ,అనంతుల శారద, ఎన్నికయ్యారు.ఎన్నికైన పాలకవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. గత ఏడుసార్లుగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సహకార బ్యాంకుల చరిత్రలో ఒక రికార్డుగా ఎన్నికల అధికారి చెప్పుకొచ్చారు.

బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ బ్యాంకు యొక్క పనితీరు బ్యాంకు అందిస్తున్న ఉత్తమ సేవల ఫలితంగా సుధాబ్యాంక్ పట్లవాటాదారులలోను ఖాతాదారులలోనూ అచంచలమైన విశ్వాసం ఉందని, ఈ ఎన్నిక ద్వారా తేటతెల్లమై నట్లు పేర్కొన్నారు. వాటాదారులందరూ ఈ ఎన్నికల ద్వారా మాపై ఉంచిన విశ్వాసాన్ని మరిన్ని మెరుగైన ఫలితాలతో నిరూపించుకుంటామని పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు.

## వాలిబాల్ చాంపియన్ షిప్ పోటీల సెలక్షన్స్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ఉమ్మడి నల్గొండ జిల్లా వాలిబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి ప్రకాష్ ఆదేశాల మేరకు వాలిబాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు సూర్యాపేట జిల్లా వాలిబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రహరి నాగరాజు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు ఆదివారం నాడు నిర్వహించిన సెలక్షన్స్‌ను చక్రహరి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట లో నవంబర్ 13,14,15 వ తేదిలలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ వాలిబాల్ చాంపియన్ షిప్ పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి పాల్గొనే జట్టును ఎంపిక చేయడం కోసం సూర్యాపేటలో ఆదివారం నాడు వాలిబాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి మన్నెం సీతారాం రెడ్డి,మోత్కూరి సందీప్, గుడిసె శేఖర్,రాచకొండ కృష్ణ, ఉపేందర్,నరేష్,మందడి కిరణ్, నవీన్,మీసాల శ్రీనివాస్,కొండలు తదితరులు పాల్గొన్నారు.




## అభివృద్ధి, సంక్షేమం చూసి మాకు ఓటెయ్యండి

- వివిధ పథకాలకు రూ.1.06 లక్షల కోట్లు వెచ్చించాం
- జూబ్లీహిల్స్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ :** రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసి జూబ్లీహిల్స్ ఓటర్లంతా కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. గత ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీల మేరకు ఉచితబస్సు, 200 యూనిట్ల విద్యుత్, గ్యాస్ రాయితీ వంటి సంక్షేమ పథకాల అమలుకు రెండేళ్లలో 1.06 లక్షల కోట్లు వెచ్చించామని తెలిపారు. యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లతో కలసి భట్టి మాట్లాడారు. "పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి సర్కారు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే.. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేయనున్నాం. ఈ నియోజకవర్గంలోని 15,000 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలిచ్చాం. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నాం. సంక్షేమ పథకాల అమలులో భాగంగా రాష్ట్రంలో 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారు. హరీశ్‌రావు మాపై ఆదాయపు పన్నుశాఖ దాడులు జరిగాయంటూ అంటున్నారు. నిజంగా జరిగితే గోప్యంగా ఉంచుతారా? ఉపఎన్నికలో ఓడిపోతామన్న భయంతోనే ఇదంతా చేస్తున్నారు" అని విమర్శించారు.



## నేటి నుంచి బీసీ హక్కుల సాధన సమితి పోరాటాలకు శ్రీకారం

- విజయవంతం చేయాలని ధనుంజయనాయుడు పిలుపు
- బీసీల రిజర్వేషన్ అమలు కోరుతూ నిరసన దీక్షలు

**హైదరాబాదు, నవంబర్ 09:** హైదరాబాదులో ఆదివారం జరిగిన బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడుతూ, బీసీ హక్కుల సాధన కోసం పోరాటాలకు నేటి నుంచే శ్రీకారం చుట్టామని తెలిపారు.ఈనెల 10, 11 తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలకు బీసీ డిమాండ్లతో వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. నవంబర్ 10న కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహాల ముందు నల్ల కండువాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.అదేవిధంగా నవంబర్ 28న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు, డిసెంబర్ తొలి వారంలో హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును కేంద్రం ఆలస్యం చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి వద్దకు అఖిలపక్ష బీసీ ప్రతినిధులను తీసుకెళ్లాలన్న ముఖ్యమంత్రి హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.అలాగే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న నవీన్ యాదవ్‌కు సమితి మద్దతు ప్రకటించారు. బీసీలు ఐక్యంగా నిలబడి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షత వహించగా, పాండురంగం చారి, బొడ్డుపల్లి కృష్ణ, పల్నాటి యాదయ్య, లోడంగి శ్రవణ్‌కుమార్, పెరుగు కుమార్, బాలయ్య యాదవ్, బాపురాజు, నరసయ్య, వెంకట్, రమేష్, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో జి. విజయ్‌కుమార్

- కాంగ్రెస్ మోసపూరిత పార్టీ - బీసీ నేత జి. విజయ్‌కుమార్ వ్యాఖ్యలు
- అభివృద్ధి కావాలో మోసం కావాలో ప్రజలే తీర్పు చెప్పాలి

**హైదరాబాద్, నవంబర్ 09:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో రహమత్‌నగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి, కేటీఆర్ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.ప్రచారంలో మాట్లాడుతూ ఆయన "అభివృద్ధి కోరితే బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలి, మోసపోవద్దు, కాంగ్రెస్ నమ్మితే ప్రజలు నట్టేట మునిగిపోతారు" అని హెచ్చరించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి సాధించిందని, కానీ కాంగ్రెస్ హామీలను గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు. "హైడ్రా కావాలో అభివృద్ధి కావాలో నిర్ణయం ప్రజల చేతుల్లోనే ఉంది" అని జి. విజయ్‌కుమార్ పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## విప్లవ విద్యార్థి అమరవీరుల స్ఫూర్తి

- కొత్త తరానికి మార్గదర్శకం
- విద్యార్థి ఉద్యమ జ్వాలలను రగిలించాలి : పి.డి.ఎస్.యు మాజీ కార్యదర్శి అజాద్
- విద్యను వ్యాపారంగా మార్చిన ప్రభుత్వాలపై మండిపాటు

**ఖమ్మం, నవంబర్ 09:** ఖమ్మంలో ఆదివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల స్మారక సభ ఘనంగా జరిగింది. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు తిప్పరపు లక్ష్మణ్ అధ్యక్షతన అమరవీరులకు నివాళులు అర్పించారు.ప్రధాన వక్తగా మాట్లాడిన పి.డి.ఎస్.యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నామాల అజాద్ మాట్లాడుతూ, "నేటి విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజ మార్పును మార్క్సిస్ట్ దృక్పథంతో అర్థం చేసుకోవాలి. విద్యను వ్యాపారంగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి" అని అన్నారు.విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలన్నారు. పేదలకు ఉచిత, నాణ్యమైన, సమాన విద్య అందే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ లాభాలకోసం పేద విద్యార్థుల భవిష్యత్తు తాకట్టు పెట్టారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి యశ్వంత్, సాధిక్, నాయకులు స్టాలిన్, శ్రీను, పేరాల వెంకటేష్, శుశాంత్, తరుణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం ఏరియాలో
# ఖనిజ పరిశీలన

- ఉత్పత్తి, రక్షణపై దృష్టి
- పద్మావతి, వికే కోల్ మైన్స్‌లో పనుల సమీక్ష
- రక్షణతో ఉత్పాదకత పెంచాలని సూచనలు
- మట్టి తొలగింపు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 09 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలోని కొత్తగూడెం ఏరియాలో పద్మావతి ఖని, వికే కోల్ మైన్‌లను డైరెక్టర్ (ప్లానింగ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. పద్మావతి ఖనిలో జరుగుతున్న టనల్ పనులను పరిశీలించి, అధికారులు రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఉత్పత్తి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వికే కోల్ మైన్ వ్యూపాయింట్ వద్ద ఓపెన్ క్యాస్ట్‌లో జరుగుతున్న మట్టి తొలగింపు పనులను పరిశీలించి, కాంట్రాక్టర్ అనుకున్న గడువులోపు బొగ్గు ఉత్పత్తికి అవసరమైన మట్టి తొలగింపును పూర్తి చేయాలని ఆదేశించారు. ఓబీ డంపులు, హాలర్ రోడ్ ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. వికే కోల్ మైన్‌లో బొగ్గు రవాణా ఏర్పాట్లు, ప్రస్తుత ఉత్పత్తి స్థితిని సమీక్షించారు. సమీక్ష సమయంలో కొత్తగూడెం ఏరియా ఉత్పత్తి, డిస్పాచ్ వివరాలను ఎస్‌ఓటు జీఎం జి.వి. కోటిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భరోస్ మహాతో, మేనేజర్ ఎం.వి.ఎన్. శ్యాం ప్రసాద్, వికే మైన్ మేనేజర్ రామచంద్ర మురళి, కాంట్రాక్ట్ మేనేజర్ కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్
## గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

- కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డితో గద్దల రమేష్ ప్రచారం
- కాంగ్రెస్ పథకాలు ప్రజలకు వివరించిన టీపీసీసీ నాయకులు
- జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ యాదవ్ గెలుపే మార్గమని పిలుపు

**పాల్వంచ, నవంబర్ 09:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఆదివారం కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి, షేక్‌పేట్ డివిజన్ ఇంచార్జ్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఓటరికి వివరించామన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయంతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.



## అశ్వారావుపేటలో ఘనంగా ఆదివాసి ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం

**అశ్వారావుపేట, నవంబర్ 09:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివారం ఆదివాసి ఉపాధ్యాయ సంఘం (ఏటీఏ) 14వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు పద్దం రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తాటి శ్రీనివాసరావు సంఘ జెండాను ఆవిష్కరించారు. తరువాత జరిగిన సభలో ప్రధాన కార్యదర్శి జారె నాగరాజు మాట్లాడుతూ, గిరిజన ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జి.ఓ. నెం.3ను పునరుద్ధరించాలని, జి.ఓ. నెం.2ను సవరించి వంద శాతం నియామకాలు, పదోన్నతులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న జీవన వ్యయ భత్యాలు విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, వేతన సవరణలను వీలైనంత త్వరగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులు, శారీరక విద్య ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని, జి.ఓ. నెం.3కు రాష్ట్ర అసెంబ్లీలో చట్టం తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఖజానా నిర్వాహకుడు కుంజా మల్లేష్, పద్దం శ్రీను, ఏలకం రాము తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, గిరిజన ఉపాధ్యాయుల ఐక్యత ప్రతిధ్వనించింది.

## పంచాయతీ భవనమే
# పిచ్చిమొక్కల పల్లకిలో..!

- బిఆర్ఎస్ పాలనలో మొదలై, నేటికీ పూర్తి కాని నిర్మాణం
- గిరిజనుల ఆశలు వృథా పిచ్చిమొక్కలే స్వాగతం పలుకుతున్నాయి
- అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం బహిర్గతం



**అశ్వారావుపేట,నవంబర్ 09:** అశ్వారావుపేట మండలంలోని రెడ్డిగూడెం గ్రామపంచాయతీ భవన నిర్మాణం, బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభమైంది. "త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం" అని హామీ ఇచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పటి మాటలు ఇప్పుడు గాలి మాటలుగా మారిపోయాయి. ప్రారంభమై అనేక సంవత్సరాలు గడిచినా పంచాయతీ భవన నిర్మాణం మాత్రం నేటికీ పూర్తి కాలేదు. ఒక్క చుట్టూ చూసినా పిచ్చి మొక్కలు, శిథిలాల మాదిరిగా ఉన్న గోడలు, పాడైపోయిన నిర్మాణ సామగ్రి మాత్రమే కనబడుతున్నాయి. భవన చుట్టూ పెరిగిన చెట్ల పొదల్లో పాములు, కీటకాలు సంచరిస్తుండడంతో గ్రామస్తులు ఆ దిశగా వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. ఇంతలో, పంచాయతీకి కేటాయించిన ట్రక్కు కూడా శిథిలావస్థకు చేరి పిచ్చిమొక్కల మధ్య తుప్పు పట్టి మునిగిపోయింది. గ్రామ అభివృద్ధి కోసం ఇచ్చిన వనరులు ఉపయోగం లేక పాడైపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. గిరిజన గ్రామమైన రెడ్డిగూడెం ప్రజలు చెబుతున్నారు ం "ఎన్నేళ్లు గడిచినా భవనం పూర్తవలేదు. అధికారులు ఒక్కసారి కూడా విచారించలేదు. భవనం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే మాకు ఎంతో సౌలభ్యం కలుగుతుంది" అని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అశ్వారావుపేట ఐటీడీఏ అధికారులు, మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పుడు అయినా ఈ సమస్యపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. "ఎన్నాళ్లు నిర్లక్ష్యమే? పంచాయతీ భవనం ఎప్పుడు పూర్తి అవుతుంది?" అని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పరిస్థితులు మాత్రం మారలేదు. రెడ్డిగూడెం గ్రామపంచాయతీ భవనమంతా ఇప్పుడు పిచ్చిమొక్కల పాలిటైన నిర్లక్ష్య సాక్ష్యం, అధికారుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. ముగింపు నోటు:గ్రామ అభివృద్ధి భవనాల కాంక్రీటులో కాక, బాధ్యత గల పరిపాలనలో ఉంది. రెడ్డిగూడెం భవనం పూర్తి చేయకపోతే, ఇది అధికార వైఫల్యానికి చిహ్నంగా మిగిలిపోతుంది.

# ఇసుక దందా ఆగదు

- ఆదివారం సైతం అక్రమ రవాణా హడావుడి!
- అధికారుల పేర్లు చెప్పి ఇష్టమొచ్చినట్టు ఇసుక తరలింపు
- ఏజెన్సీ వాగుల హక్కులు కాలరాస్తున్న మాఫియా
- కలెక్టర్ జోక్యం తప్ప దందా ఆగదన్న గిరిజనుల వేదన



**అశ్వారావుపేట,నవంబర్ 09:** అశ్వారావుపేట మండలంలో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకీ అదుపు తప్పుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు మూసి ఉన్న ఆదివారాలు సైతం ఈ దందా ఆగడం లేదు. అధికారుల పేర్లు, రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతాల్లోని వాగుల నుంచి బహిరంగంగా ఇసుకను ఎత్తుకుపోతున్నారు. "సిసి రోడ్లు వేయాలి", "ఇందిరమ్మ గృహాలకు అవసరం" అంటూ నెపం పెట్టుకుని, నిజానికి మాత్రం పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుకను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనివల్ల పల్లెల్లోని వాగులు, చెరువులు నీటి నిల్వలు కోల్పోతు



న్నాయి. వర్షాకాలం రాకముందే వాగుల అడుగున మట్టి కనిపించకుండా పోవడం గమనార్హం. మండలంలోని ఏజెన్సీ గ్రామాల వాగులు, చెరువులు ఇప్పుడు ఇసుక మాఫియాల చేతుల్లోకి జారిపోయాయి. ట్రాక్టర్లు వరుసగా దూసుకుపోతూ ఇసుకను ఎత్తుకుపోతున్నా, ఎవ్వరూ అడ్డుకోవడం లేదు. అధికారులు కళ్లుచూపినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గిరిజనులు చెబుతున్నారు ం "ప్రతి ఆదివారం ఈ దందా పీక్‌కు చేరుతోంది. అధికారుల పేర్లు చెప్పి, ఎవ్వరూ అడ్డుకోలేని స్థాయిలో ఇసుకను తరలిస్తున్నారు. మా వాగులు ఖాళీ అవుతున్నాయి, కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు" అని వారు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా పర్యావరణం దెబ్బతింటోంది, నీటి వనరు లు నశిస్తున్నాయి, గ్రామస్థుల జీవనాధారం ప్రమాదంలో పడుతోంది. ప్రజలు ఇప్పుడు జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు ం "మీరు నేరుగా జోక్యం చేసుకోకపోతే, ఈ ఇసుక దందా ఎప్పటికీ ఆగదు. అధికారుల మౌనం, మాఫియాల దౌర్జన్యం మాకు భయం కలిగిస్తోంది" అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగింపు మాట:ఇసుక ఎత్తుకుపోతున్నది వాగులలోని, ఇసుక,మట్టి మాత్రమే కాదు ం అధికార యంత్రాంగం ప్రతిష్ట కూడా. ఇప్పుడైనా కఠిన చర్యలు తీసుకోవకపోతే, రేపు ఈ వాగుల్లో నీరు కాదు, పశ్చాత్తాపమే మిగిలిపోతుంది.

## భూసమస్యల పరిష్కారానికి
# డివిజన్ వారీగా ప్రజావాణి

- ప్రజల సౌకర్యార్థం కొత్తగూడెం, భద్రాచలంలో ప్రత్యేక ఏర్పాట్లు
- సుదూర ప్రాంతాల ప్రజలకు కలెక్టర్ సౌకర్యం కల్పన
- ఇతర సమస్యల కోసం కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరణ



**భద్రాద్రి, నవంబర్ 09:** భూసమస్యల పరిష్కారానికి ప్రజల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు డివిజన్ వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు తమ భూసమస్యల పరిష్కారం కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం డివిజన్ ప్రజలు కొత్త గూడెం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి హాజరవవచ్చు. ఇతర సమస్యలపై దరఖాస్తులు చేసుకునే వారు కలెక్టరేట్ ఇన్వార్డ్ విభాగంలో దరఖాస్తులు అందజేసి రసీదు పొందాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.



## వనభోజనాలతో
# ఐక్యత, స్నేహభావం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- లక్ష్మీదేవిపల్లిలో ఆర్యవైశ్య వనభోజన మహోత్సవం
- సామూహిక భోజనాలు సోదరభావానికి ప్రతీక
- సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ఆదర్శమని ఎమ్మెల్యే ప్రశంస

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 09:** లక్ష్మీదేవిపల్లి మండలం యల్లావుల పాపారావు తోటలో జరిగిన ఆర్యవైశ్య వనభోజన మహోత్సవంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, కార్తీక మాస వనభోజనాలు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సామూహికంగా వనసమారాధన జరుపుకోవడం ఆధ్యాత్మికతకు, సోదరభావానికి నిదర్శనమని అన్నారు. సామాజిక సేవా రంగంలో ఆర్యవైశ్యులు ఎప్పటికీ అగ్రస్థానంలో ఉన్నారని, ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. చివరగా ప్రజలందరికీ కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు.

## రెడ్డిగూడెంలో ప్రత్యేక వైద్య సదస్సు
### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య శాఖ పిలుపు



**అశ్వారావుపేట, నవంబర్ 09:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో నవంబర్ 11న ప్రత్యేక వైద్య సదస్సు నిర్వహించనున్నారు. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ భద్రాచలం ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సైదులు ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగనుంది. వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రాందాస్ తెలిపారు. ఈ సదస్సులో కంటి, గైనకాలజీ, చిన్న పిల్లలు, హృదయ, మానసిక, క్షయ తదితర విభాగాలకు చెందిన వైద్యులు సేవలందించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్సలు పొందాలని ఆయన సూచించారు.

## లంబాడీల వనభోజన మహోత్సవం
# ఐక్యతకు కొత్త పునాది

- రఘునాథపాలెం ఆర్‌జీబీ మామిడి తోటలో వేలాది కుటుంబాల సమాగమం
- వేసా, భాష, సంప్రదాయాల పరిరక్షణపై పిలుపు
- రాజకీయ రంగంలో ఐక్యత అవసరమని నాయకుల సందేశం



**ఖమ్మం, నవంబర్ 09 :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఆర్‌జీబీ మామిడి తోటలో ఆదివారం జరిగిన లంబాడి వనభోజన మహోత్సవం ఘనవిజయవంతమైంది. వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన లంబాడి కుటుంబాలు ఒకచోట చేరి, తమ సాంప్రదాయ ఆచారాలతో, సంగీత నృత్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, లంబాడీల వేసా, భాష, సంప్రదాయాలు మరవకుండా తరం తరం వారసత్వంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈతరపు పిల్లలు తమ మూలాలను గుర్తించి, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. రాజకీయ రంగంలో కూడా లంబాడీ సమాజం ఐక్యంగా ఉండి, ప్రతినిధిత్వం పెంచుకునే దిశగా కృషి చేయాలని స్పష్టం చేశారు. "ఐక్యతే శక్తి %-% మన హక్కులు మనమే సాధించాలి" అనే నినాదాలతో వేదిక మార్మోగింది. ఈ మహోత్సవానికి కన్వీనర్ పోరిక రాములు నాయక్, కో కన్వీనర్ భూక్య మంగ్యా నాయక్, ట్రెజరర్ మంగిలాల్ జాదవ్ ప్రధాన నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, హరిప్రియ నాయక్, ఖమ్మం మాజీ మేయర్ పాపాలాల్, టీఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్, అలాగే రాజకుమార్ జాదవ్, బిక్షపతి రాథోడ్, బాల్ సింగ్, జి. రమేష్, కిషన్ నాయక్, దశరధి నాయక్, చక్రవర్తి, హదిరామ్, బన్సీ లాల్, సీతారాం, దేవా సింగ్, నాగు, దాసు, గౌతమి, జ్యోతి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు. సాంప్రదాయ వేషధారణలో పాల్గొన్న మహిళలు, యువతులు మహోత్సవానికి విశేష ఆకర్షణగా నిలిచారు. వేదికపై లంబాడీ జానపద గీతాలు, గోర్బి నృత్యాలు సందడి చేకూర్చగా, వనభోజనాలతో ఉత్సవ వాతావరణం నెలకొంది. ముగింపు నోటు:సంప్రదాయాన్ని కాపాడుకుంటూ సమాజ ఐక్యతను బలపరచిన లంబాడీల వనభోజన మహోత్సవం ం సాంస్కృతిక చైతన్యానికి, సామాజిక ఏకతకు చిహ్నంగా నిలిచింది.








# దూకుడుకూ ఓ హద్దు ఉండాలి

## అభిషేక్‌కు మాజీ ఆల్‌రౌండర్ వార్నింగ్

భారత క్రికెట్‌లో ప్రస్తుతం అభిషేక్ శర్మ ఓ సంచలనం. ఇతడు క్రీజులోకి వచ్చాడంటే తనదైన షాట్లతో బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. ఈ కుర్రాడి దూకుడుకు ఆస్ట్రేలియా బౌలర్లు వైవిధ్యభరితమైన బంతులతో కాస్త కళ్లెం వేశారు. అయినా ఆసీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో అభిషేక్ శర్మనే టాప్ స్కోరర్. 176.34 స్ట్రైక్‌రేట్‌తో 163 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఈ నేపథ్యంలో దూకుడుకూ ఓ హద్దు ఉండాలంటూ భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిషేక్‌కు వార్నింగ్ ఇచ్చాడు. ప్రతి బంతిని ముందుకు వచ్చి బాదలనుకుంటే బౌలర్లు దాని మీద దృష్టి పెట్టి బోల్తా కొట్టించడానికి ప్రయత్నిస్తారని పేర్కొన్నాడు. 'అభిషేక్ శర్మ నిర్భయంగా ఆడుతున్నాడు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, ప్రస్తుతం జరుగుతున్నవి ద్వైపాక్షిక సిరీస్‌లు.. ప్రపంచ కప్ కాదు. వరల్డ్ కప్‌నకు జట్లు చాలా సన్నాహాలతో వస్తాయి. ఇప్పుడు అభిషేక్ ప్రతి బంతిని క్రీజు వదిలి బయటకు వచ్చి ఆడాలనుకుంటే ప్రత్యర్థి జట్టు బౌలర్లు దీనిపై దృష్టిపెడతారు. కాబట్టి, అభిషేక్ షాట్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. టీమ్ మేనేజ్‌మెంట్ కచ్చితంగా దీనిపై ఫోకస్ పెడుతుందని అనుకుంటున్నా. అతడి వ్యక్తిగత కోచ్ యువరాజ్ సింగ్ కూడా ఈ విషయంపై దృష్టిపెట్టాలి. నేను యూవీతో మాట్లాడతా. అభిషేక్ కూడా దూకుడుగా ఆడే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అందరి బౌలింగ్‌లో ఇన్నింగ్స్ తొలి బంతికే ముందుకు వచ్చి భారీ షాట్ ఆడలేవు' అని ఇర్ఫాన్ పఠాన్ హెచ్చరించాడు. ఆస్ట్రేలియాతో ఐదో టీ20 వర్షం కారణంగా రద్దయింది. టాస్ ఓడి టీమ్‌ఇండియా బ్యాటింగ్‌కు దిగగా.. 4.5 ఓవర్ల తర్వాత వర్షం కురవడంతో మ్యాచ్‌ను నిలిపేశారు. ఈ ఇన్నింగ్స్‌లో 13 బంతుల్లో 23 పరుగులు చేసిన అభిషేక్.. రెండుసార్లు ఆసీస్ ఫీల్డర్లు సులువైన క్యాచ్‌లు వదిలేయడంతో ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని ఇర్ఫాన్ ప్రస్తావిస్తూ.. 'ఐదో టీ20లో రెండుసార్లు అతడికి లైఫ్ వచ్చింది. అందులో ఒక్క క్యాచ్ పట్టినా అభిషేక్ ఇన్నింగ్స్ ముగిసేది. అతడు హై రిస్క్ క్రికెట్ ఆడుతూనే ఉంటాడు. కానీ, దూకుడుకు కూడా ఓ హద్దు ఉండాలి. ఈ విషయంలో అతడికి కొంత ప్రణాళిక అవసరం. సిరీస్ ఆరంభం నుంచి నాథన్ ఎల్లిస్ తన బౌలింగ్‌లో మార్పులు చేస్తూ అభిషేక్‌ను ఇబ్బందిపెట్టాడు. ఇతర జట్లు కూడా అభి విషయంలో ఇదే వ్యూహాన్ని అనుసరించాలని చూస్తాయి' అని మాజీ ఆల్‌రౌండర్ వివరించాడు.




వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టులో కీలక సభ్యురాలైన వికెట్‌కీపర్ రిచా ఘోష్ పై టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ప్రశంసలు కురిపించాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తూ ఎంతో ఒత్తిడిలోనూ తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు చేసిందన్నాడు. శనివారం రిచా ఘోష్‌ను ఆమె సొంత రాష్ట్రం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి గంగూలీ హాజరై మాట్లాడాడు. 'నీ కెరీర్ ఇప్పుడే మొదలైంది. రాబోయే నాలుగు నుంచి ఆరు సంవత్సరాలలో మహిళల క్రికెట్ ఎంతో అభివృద్ధి చెందుతుంది. మరిన్ని అవకాశాలు వస్తాయి. నువ్వు వాటిని సద్వినియోగం చేసుకుంటావని నేను ఆశిస్తున్నా. ఏదో ఒక రోజు జులన్ గోస్వామి లాగా మనం ఇక్కడి నిలబడి 'రిచా భారత కెప్టెన్' అని చెబుతాం.

# రిచా ఘోష్.. నిన్ను భారత కెప్టెన్‌గా చూడాలనుకుంటున్నా : సౌరభ్ గంగూలీ

మీకింకా 22 ఏళ్లే. ఎంతో భవిష్యత్ ఉంది. మీకు హృదయపూర్వక అభినందనలు. లోయర్ ఆర్డర్ చాలా ఆడటం చాలా కష్టం. కానీ, రిచా తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు చేసింది. అందరూ సెమీ ఫైనల్‌లో జెమీమా రోడ్రిగ్స్ 127లి, హర్మన్‌ప్రీత్ 89 ఇన్నింగ్స్‌లనే గుర్తుంచుకుంటారు. కానీ, 130 కంటే ఎక్కువ స్ట్రైక్‌రేట్‌తో రిచా చేసిన రన్స్ చాలా విలువైనవి' అని గంగూలీ పేర్కొన్నాడు. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో ముఖ్యమంత్రి మమత బెనర్జీ.. రిచాను సన్మానించి ఆమెకు రాష్ట్ర అత్యుత్తమ పౌర అవార్డు 'బంగ భూషణ్'ను ప్రదానం చేశారు. అంతేకాక రిచాను డీఎస్పీగా నియమిస్తూ బెంగాల్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వర్ణ హారం ఇవ్వడంతో పాటు ఫైనల్లో ఆమె చేసిన 34 పరుగులకు గుర్తుగా రూ.34 లక్షల నగదు బహుమతిని కూడా బహూకరించింది. ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఉన్న తొలి బెంగాల్ క్రికెటర్ రిచానే. 2003లో సౌరభ్ గంగూలీ ఆ అవకాశాన్ని కొద్దిలో కోల్పోయాడు.




# ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ఎవరంటే?

ఆస్ట్రేలియా, భారత్ మధ్య శనివారం జరగాల్సిన ఐదో టీ20 వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఈ సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-1తో కైవసం చేసుకుంది. ట్రోఫీ అందుకున్న అనంతరం టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును ప్రకటించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ మెడల్‌ని సాధించాడు. రహిల్ ఖాజా (టీమ్ ఆపరేషన్స్ మేనేజర్) సుందర్‌కు అవార్డు అందజేశారు. రహిల్ చేతుల మీదుగా ఈ పతకాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వాషి పేర్కొన్నాడు. ప్రతి రోజూ ఆయన చాలా శ్రమిస్తూతమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారని సుందర్ అన్నాడు. ఆస్ట్రేలియాకు రావడం, తుది జట్టులో చోటు దక్కించుకుని టీమ్ విజయానికి తోడ్పడటం తనకు చాలా సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో వాషింగ్టన్ సుందర్ మూడు మ్యాచ్‌లు ఆడాడు. సిరీస్‌లో 0-1తో వెనకబడి ఉన్న తరుణంలో కీలకమైన మూడో మ్యాచ్‌లో సుందర్ బ్యాట్‌తో సత్తాచాటాడు. 23 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌ల సాయంతో 49 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. నాలుగో మ్యాచ్‌లో 1.2 ఓవర్లే బౌలింగ్ చేసిన సుందర్ మూడు పరుగులే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.




# సూపర్ ఫామ్‌లో ధ్రువ్ జురెల్

ఈ ఏడాది ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లో గాయపడిన రిషభ్ పంత్ కోలుకున్నాడు. నవంబర్ 14 నుంచి స్వదేశంలో సఫారీలతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికయ్యాడు. పంత్ తుది జట్టులోనూ ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. పంత్ లేనప్పుడు వికెట్‌కీపర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకున్న ధ్రువ్ జురెల్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికా-ఎతో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో జురెల్ రెండు శతకాలు (132, 127) బాదేశాడు. అంతకుముందు వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ ఓ సెంచరీ చేశాడు. దీంతో ఇప్పుడు తుది జట్టు ఎంపిక టీమ్ మేనేజ్‌మెంట్‌కు సవాలుగా మారింది. ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఆడించకపోతే విమర్శలు ఎదుర్కొక తప్పదు. ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయ తీసుకున్నట్లు సమాచారం. ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని తుది జట్టు నుంచి తప్పించి ధ్రువ్ జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 'జురెల్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడే అవకాశం ఉంది. అతడు టాప్, లోయర్ ఆర్డర్లలో ఆడటానికి సరిపోతాడు. కానీ, ప్రస్తుతం ఆ స్థానంలో ఆడుతున్న సాయి సుదర్శన్ గత టెస్టులో అర్ధ శతకం చేశాడు. అంతేకాకుండా మూడో స్థానం కోసం ప్రయోగాలు చేయొద్దని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. మరొక స్థానం నితీశ్ రెడ్డిది. భారత గడ్డపై జరిగే మ్యాచ్‌ల్లో అతని బౌలింగ్ పెద్దగా అవసరం ఉండదు. కాబట్టి జురెల్‌ని కాదని నితీశ్‌ని ఆడించలేము' అని బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు జరగనుంది. ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్న రెండో టెస్టుకు గువాహటి ఆతిథ్యం ఇవ్వనుంది.






## ఓటీటీలోకి 'తెలుసు కదా'..

దీపావళి సందర్భంగా అక్టోబరులో బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'తెలుసు కదా' ఒకటి. ఈ రొమాంటిక్ డ్రామా మూవీ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 14 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. సిద్ధు జొన్నలగడ్డ, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతోనే దర్శకురాలిగా మారిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కథేంటంటే: వరుణ్ (సిద్ధు జొన్నలగడ్డ) ఓ అనాథ. తనకంటూ ఓ కుటుంబం కావాలనుకుంటాడు. కాలేజీ రోజుల్లోనే రాగ (శ్రీనిధి శెట్టి)తో ప్రేమలో పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. రాగ మాత్రం అతడిని కాదనుకుని, దూరమవుతుంది. ఆ బాధ నుంచి బయటికొచ్చి పెళ్లి సంబంధాల కోసం ప్రయత్నాలు చేస్తాడు వరుణ్. అంజలి (రాశీఖన్నా)తో మనసు కలిసి.. ఆమెతో కలిసి ఏడడుగులు వేస్తాడు. ఇద్దరికీ పిల్లలంటే ఎంతో ఇష్టం. కానీ, అన్యోన్యంగా కొత్త జీవితాన్ని మొదలుపెట్టిన ఆ ఇద్దరికీ ఊహించని ఓ సమస్య ఎదురవుతుంది. అదేంటి? వరుణ్ జీవితంలో మళ్లీ రాగ ఎందుకు రావాల్సి వచ్చింది? ఆమె వచ్చాక వరుణ్, అంజలి మధ్య బంధం ఎలాంటి సంఘర్షణకు గురైంది? అసలు వరుణ్‌ని రాగ ఎందుకు వదిలేసి వెళ్లిపోయింది? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.



## న్యాయపరంగానే ముందుకెళతా

నటి అనుపమ పరమేశ్వరన్ కేరళ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆన్‌లైన్ వేదికగా తనకు వేధింపులు రావడంపై ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా నటి ఈ వివరాలు తెలిపారు. "నా గురించి అసత్య ప్రచారం చేస్తున్న ఓ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ కొన్ని రోజుల క్రితం నా దృష్టికి వచ్చింది. నా ఫ్యామిలీ, స్నేహితులు, నా సహ నటులే లక్ష్యంగా ఆ ఖాతాలో పోస్టులున్నాయి. మార్ఫింగ్ చేసిన ఫొటోలు కూడా కనిపించాయి. ఈ ఆన్‌లైన్ వేధింపులతో బాధపడ్డాను. నన్ను ద్వేషిస్తూ అదే వ్యక్తి మరికొన్ని ఫేక్ అకౌంట్లు సృష్టించినట్టు తర్వాత తెలిసింది. కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశా. అధికారులు వెంటనే స్పందించారు. ఈ చర్యల వెనుక ఉన్న వ్యక్తిని కనిపెట్టారు. తమిళనాడుకు చెందిన 20 ఏళ్ల యువతి ఇదంతా చేసినట్లు తెలిసి ఆశ్చర్యపోయా. ఆమెది చిన్న వయసు. తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నేను పూర్తి వివరాలు పంచుకోవాలని అనుకోవడం లేదు. న్యాయపరంగానే ముందుకెళతా" అని పేర్కొన్నారు.



## రా అండ్ రస్టిక్‌గా ఉంటుంది..

రాకింగ్ స్టార్ యష్ త్వరలో 'టాక్సిక్' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగుళూరులో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ యాక్షన్-ప్యాక్డ్ డ్రామా మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రేక్షకులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న ఈ మూవీలో క్రేజీ అండ్ సెన్సేషనల్ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్‌లో పాల్గొన్న ఈ బ్యూటీ 'టాక్సిక్' విశేషాలు పంచుకుంది. "టాక్సిక్' అనేది ఇప్పటివరకు కన్నడ లేదా భారతీయ సినిమాల్లో మనం చూసిన వాటన్నింటికంటే భిన్నంగా ఉంటుంది. ఇది రా అండ్ రస్టిక్‌గా ఎన్నో లేయర్స్‌తో అద్భుతంగా ఉ ండబోతోంది. దర్శకురాలు గీతు విజన్ ఎంతో బోల్డ్‌గా ఉంటూనే.. అదే సమయంలో ఎంతో హృద్యంగానూ ఉంటుంది.. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది' అంటూ రుక్మిణి చెప్పిన మాటలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com